


# విజయభాను




విశాఖపట్నం, శనివారం 10-06-2023 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 47 సంచిక : 223 పేజీలు : 08 వెల : 1 రూపాయి

## 'మీరు బాగుంటేనే.. ప్రజలు బాగుంటారు'

- సీఎం జగన్‌తో ఉద్యోగ సంఘాల నేతలు భేటీ
- ముఖ్యమంత్రి జగన్‌ను సత్కరించిన నేతలు



అమరావతి, (విజయభాను న్యూస్) : తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు శుక్రవారం కలిశారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, జీపీఎస్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ.. సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల విషయంలో రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను 60 రోజుల్లోగా అమలు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. కొత్తగా జీపీఎస్‌ను తీసుకురావడం, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ప్రభుత్వంలో ఏపీవీవీపీ ఉద్యోగుల విలీనం, పీఆర్సీ కమిషన్‌ఏర్పాటు సహా రాష్ట్ర కేబినెట్, ఉద్యోగుల విషయంలో తీసుకున్న నిర్ణయాలపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ప్రభుత్వం నుంచి జరగాల్సిన మంచి ఏదైనా ఉద్యోగులకు చేస్తాం. ఉద్యోగులు అనేవారు ప్రభుత్వంలో భాగస్వాములు. ఉద్యోగులు బాగుంటేనే ప్రజలు బాగుంటారని విశ్వసించిన ప్రభుత్వం మనది. మీ మనసులో కష్టం ఉండకుండా చూడాలన్నదే మా ఉద్దేశం అని సీఎం పేర్కొన్నారు.

"అందుకే పెన్షన్సహా కొన్ని పరిష్కారాల కోసం రెండేళ్లుగా తపనపడ్డాం. గతంలో ఎవ్వరూ కూడా ఈ సమస్యలకు పరిష్కారం చూపించడానికి తపనపడ్డ సందర్భాలు లేవు. ఉద్యోగులకు పరిష్కారం దొరకాలి, అంతేకాకుండా భావితరాలను కూడా దష్టిలో ఉంచుకోవాలి. దీన్ని దష్టిలో ఉంచుకుని జీపీఎస్ను తీసుకువచ్చాం. రిటైర్డ్ ఉద్యోగుల జీవన ప్రమాణాలను కూడా నిలబెట్టేదిగా జీపీఎస్‌ను రూపొందించాం. 62 ఏళ్లకు రిటైర్ అయితే 82 ఏళ్లలో కూడా అదే స్థాయిలో జీవన ప్రమాణాలు ఉండాలి. అందుకే ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని డీఆర్లు ఇచ్చేలా జీపీఎస్‌లో పొందుపరిచాం" అని సీఎం జగన్ చెప్పారు.

"ఉద్యోగులకు న్యాయం జరగాలి, మరోవైపు నడపలేని పరిస్థితులు కూడా రాకుండా ఉండాలి. సీపీఎస్‌లో లేనివి జీపీఎస్‌లో ఉన్నాయి. రెండేళ్ల పాటు జీపీఎస్‌పై ఆర్థికశాఖ సుదీర్ఘకసరత్తు చేసింది. దీని

తరువాయి 2లో..

## పదవికి విరమణ కానీ.. మాట్లాడే పెదవులకు విరమణ లేదు

- యువతను మేల్కొల్పడం నా హాబీ
- ప్రపంచంలోనే అత్యధిక యువశక్తి గల దేశం భారత్
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



గుంటూరు (విజయభాను న్యూస్): గుంటూరు ఆర్‌వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల ఎనిమిదవ గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని మాజీ ఉపరాష్ట్ర పతి వెంకయ్య నాయుడు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో వెంకయ్య నాయుడు మాట్లాడుతూ. యువతను మేల్కోల్పడం నాకు ఇష్టమైన పని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలతో గడపడం నాకు ఇష్టమని ఆయన పేర్కొన్నారు. పదవికి విరమణ ఇచ్చాను కానీ మాట్లాడే పెదవులకు విరమణ లేదని ఆయన అన్నారు. అంతేకాకుండా.. విద్యావిధానాన్ని భారతీయకరణ చేయాలని ఆయన వ్యాఖ్యానించారు. ప్రపంచంలో యువ శక్తి ఎక్కువగా ఉన్న దేశం మనదని ఆయన అన్నారు. పురుషులతో పాటు స్త్రీ లు పోటీ ప్రపంచంలో దూసుకు వెళ్తున్నారని ఆయన కొనియాడారు. ప్రపంచంలో వస్తున్న మార్పులతో ఉపాధి అవకాశాల తో పాటు పోటీ తత్వం, సవాళ్లు కూడా పెరుగుతున్నాయని ఆయన అన్నారు.

యువత క్రమశిక్షణ, కష్టపడే తత్వం, కలుపుగోలుగా ఉండటం అలవరుచుకోవాలని ఆయన అన్నారు. పాశ్చాత్య ధోరణి మన దేశానికి, యువతకు మంచిది కాదని, భారతీయ ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని ఆయన అన్నారు. యోగను యువత జీవితంలో భాగం కావాలన్నారు. యోగా మతానికి సంబంధించిన అంశం కాదు ప్రపంచం ఆచరిస్తున్న ఆరోగ్య మంత్రం అని ఆయన అన్నారు.

## ఐ-టీడీపీ ఆర్గనైజేషన్ పనితీరు బాగుంది

**సొంత ఊరి నుంచే ఆన్‌లైన్‌లో పని చేసేందుకు నైపుణ్య శిక్షణ**

**ఐటీడీపీ కార్యకర్తల సదస్సులో పాల్గొన్న చంద్రబాబు**



మంగళగిరి, (విజయభాను న్యూస్) : అమరావతి విషయంలో ఆందోళన అక్కర్లేదని, తెదేపా అధికారంలోకి రాగానే పనులు పరుగులు పెట్టిస్తామని ఆ పార్టీ అధినేత చంద్రబాబు అన్నారు. మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ఐటీడీపీ కార్యకర్తల సదస్సులో పాల్గొన్న ఆయన..

తరువాయి 2లో..

## జులై 1 నుంచి అమర్ నాథ్ యాత్ర



ఢిల్లీ: అమర్ నాథ్ యాత్ర షెడ్యూల్ ఖరారైంది. జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు 62 రోజుల పాటు అమర్‌నాథ్ యాత్రకు కేంద్రం ఏర్పాటు చేసింది. దక్షిణ కశ్మీర్‌లోని హిమాలయ పర్వతాల్లో, భూమికి 3,880 మీటర్ల ఎత్తులో అమర్‌నాథ్ ఆలయం ఉంది. అమర్‌నాథ్ గుహలోని శివలింగాన్ని దర్శించుకునేందుకు ఏటా లక్షలాది మంది భక్తులు దేశ నలుమూల నుంచి తరలివెళ్తుంటారు. అనంత నాగ్ జిల్లా పహల్గామ్, గండర్ బాల్ జిల్లా బల్టాల్ మార్గాల్లో 2023 అమర్‌నాథ్ యాత్ర కొనసాగుతుంది.

ఈ నేపథ్యంలో ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం, సాయంత్రం ప్రార్థనలను ఈసారి లైవ్ టెలికాస్ట్ చేసి ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు చూసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే.. అమర్‌నాథ్ యాత్రకు సన్నాహాలు, భద్రతను సమీక్షించడానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుక్రవారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు.


## వైఎస్ భాస్కర్‌రెడ్డికి బెయిల్ నిరాకరణ

భాస్కర్ రెడ్డి బెయిల్ పిటిషన్ ను కొట్టివేసిన సీబీఐ కోర్టు

సునీత, సీబీఐ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం

హైదరాబాద్, (విజయభాను న్యూస్) : మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో.. వైఎస్ భాస్కర్ రెడ్డి బెయిల్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. బెయిల్ కోసం భాస్కర్ రెడ్డి ప్రయత్నించగా.. బెయిల్ పిటిషన్‌ను సీబీఐ కోర్టు శుక్రవారం కొట్టివేసింది. సునీత, సీబీఐ వాదనలతో న్యాయస్థానం ఏకీభవించింది. ఈ కేసులో మెరిట్స్ ఆధారంగా తీర్పు వెల్లడించింది. కేసు కీలక దశలో ఉన్నందునా కి బెయిల్ మంజూరు చేయలేమని కోర్టు స్పష్టం చేసింది. వివేకా హత్య కుట్రలో భాస్కర్ రెడ్డిది కీలకపాత్ర అని సీబీఐ ఆరోపించింది. వివేకా హత్య కేసులో వైఎస్ అవినాష్‌రెడ్డిని 8వ నిందితుడిగా, ఇప్పటికే అరెస్ట్ అయిన వైఎస్ భాస్కర్ రెడ్డిని 7వ నిందితుడిగా సీబీఐ స్పష్టం

తరువాయి 2లో..




## జిల్లాలో 194 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్

# ప్రతి పాదనలకు ఆమోదం

**-జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున**



విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : జిల్లాలో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలలో విధులు నిర్వహించుచున్న 194 మంది జర్నలిస్టులకు సంబంధించి అక్రిడిటేషన్ ప్రతిపాదనలను ఆమోదించడం జరిగిందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ డా.ఎ.మల్లిఖార్జున తెలిపారు. జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో శుక్రవారం ఉదయం కలెక్టర్ మరియు చైర్మన్ డి ఎం ఎ సి, అధ్యక్షతన జిల్లా అక్రిడిటేషన్ కమిటీ రెండవ సమావేశం ఏర్పాటు జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలలో విధులు నిర్వహించుచున్న ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డులను మొదటి విడతగా 301 మంజూరు చేయడం జరిగిందని, ఈరోజు జరిగిన సమావేశంలో రెండవ విడతగా 194 మొత్తం 495 కార్డులు ఇప్పటి వరకు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఇంకా మిగిలి ఉన్న, ఇప్పటి వరకు ఆన్ లైన్ ద్వారా ధరఖాస్తు చేయని జర్నలిస్టులు ప్రభుత్వ ఉత్తర్వులు 38, తేది 30-3-2023 ననుసరించి ధరఖాస్తు చేసుకొని సదరు ధరఖాస్తులను జిల్లా పౌర సంబంధాల కార్యాలయానికి అందజేయాలని అన్నారు. 10వ తేదీన

తరువాయి 2లో..

## అర్హులందర్నీ రెగ్యులరైజ్ చేయాలి – నాగోతి శివాజీ



మధురవాడ (విజయభాను న్యూస్) : ప్రైవేట్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరినీ రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని టిఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ డిమాండ్ చేశారు. మహావిశాఖ 7వ వార్డు పరిధి కళానగర్లోని ఆయన కార్యాలయంలో టీడీపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు అచ్చం నాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం పనితీరుపై ఆయన ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం 2014 జూన్ నాటికి ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని అలాగే ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు టైం స్కేల్ ఇస్తామని చెప్పి కేవలం పదివేల మందిని మాత్రమే రెగ్యులరైజ్ చేసి ఇచ్చిన మాట తప్పారని ఎన్నికల హామీలను తుంగలో తొక్కారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి అందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని లేదంటే తమ పోరాటం ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

## టౌన్ ప్లానింగ్ పిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్ – 8187897569...

09-06-2023(శుక్ర వారం) "టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం" లో 16 పిర్యాదులు...




విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : జివిఎంసి పరిధిలో ఎనిమిది జోన్లలో ఉన్న పట్టణ ప్రణాళిక విభాగంలో పిర్యాదులు అధికంగా వస్తున్న నేపద్యంలో జివిఎంసి కమీషనర్ సి ఎం సాయికాంత్ వర్మ టౌన్ ప్లానింగ్ పిర్యాదుల కోసం ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా "టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం" కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడంలో భాగంగా అధికంగా పట్టణ ప్రణాళిక విభాగపు ఆధ్వర్యంలో డిసిపి నరేంద్రనాధ్ రెడ్డి, ఎసిపిలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, డబుల్యూపిఆర్ఎస్ సిబ్బంది శుక్రవారం నిర్వహించిన "టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం" కార్యక్రమంలో జోన్ – 2(01), జోన్ – 4 (01), జోన్ – 5 (05), జోన్ –6(06), జోన్ – 8(03), మొత్తం – 16 పిర్యాదులు అందినట్లు కమీషనర్ ఒక ప్రకటనలో తెలియజేసారు. మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో ఉన్నటువంటి ఎనిమిది జోన్లలో ఎలాంటి అనాధికార నిర్మాణాలు జరుగుతున్నా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్ధాలపై, టౌన్ ప్లానింగ్ విభాగంపై ఎలాంటి పిర్యాదుల గురించి తెలియజేయాల న్నా, జివిఎంసిలో ఉన్న టోల్ ఫ్రీ ఫోన్ నంబర్ : 1800 4250 0009కు ఫోన్ చేసి నేరుగా తమ సమస్యను తెలియజేయవచ్చు మరియు జివిఎంసి టౌన్ ప్లానింగ్ విభాగం వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన "వాట్సాప్ నంబర్ : 81878 97569"కు వారి యొక్క మొబైల్ నుండి తమ పిర్యాదులను పూర్తి వివరములతో అనగా పేరు, డోర్ నెంబర్, వార్డ్ నెంబర్, చిరునామా మరియు సమస్య యొక్క వివరములను వాట్సాప్ పంపిన యెడల వాటిని సంబందిత జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ద్వారా పై అధికారులకు నివేదించి, ఆ సమస్య పై సత్వర చర్యలు చేపడతామని తెలిపారు.

## మహిళా రెజ్లర్‌తో.. బ్రిజ్‌భూషణ్ ఆఫీస్ వద్ద సీన్ రీక్రియేషన్..



దిల్లీ: భాజపా ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ తమను లైంగికంగా వేధించారంటూ మహిళా రెజర్లు చేసిన ఆరోపణలపై దిల్లీ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే శుక్రవారం ఆయన కార్యాలయానికి ఓ మహిళా రెజ్లర్‌ను తీసుకెళ్లిన పోలీసులు. అక్కడ సీన్ రీక్రియేట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలు వెల్లడించినట్లు పీటీఐ కథనం వెల్లడించింది. "శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో దిల్లీలోని బ్రిజ్ భూషణ్ ఆఫీస్‌కు పోలీసులు మహిళా రెజ్లర్‌ను తీసుకెళ్లారు. ఆమె వెంట మహిళా కానిస్టేబుల్స్ కూడా ఉన్నారు. దాదాపు అరగంట పాటు పోలీసులు అక్కడ ఉన్నారు. ఆ నివాసంలో ఎక్కడెక్కడ వేధింపులకు గురైందో గుర్తుకు తెచ్చుకుని ఆ సీన్‌ను రీక్రియేట్ చేయాలని పోలీసులు ఆమెను అడిగారు" అని సదరు వర్గాలు పేర్కొన్నాయి. రెజ్లర్ల ఫిర్యాదుతో బ్రిజ్ భూషణ్‌పై దిల్లీ పోలీసులు రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. వాటిపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరుపుతోంది. ఇప్పటివరకు 180కి పైగా మందిని విచారించారు. దర్యాప్తు పూర్తి చేసి వచ్చే వారం లోగా కోర్టుకు నివేదిక సమర్పిస్తామని ఇటీవల సిట్ అధికారులు వెల్లడించారు. బ్రిజ్ భూషణ్‌కు వ్యతిరేకంగా ఇటీవల భారత అగ్రశ్రేణి రెజర్లు దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కొన్ని రోజుల పాటు దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. వీరి ఆందోళన ఇటీవల ఉద్ధృతమవడంతో స్పందించిన కేంద్ర క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్.. వారితో చర్చలు జరిపారు. బ్రిజ్ భూషణ్‌పై ఈ నెల 15 లోపు ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని, జూన్ 30 లోపు డబ్ల్యూఎఫ్ఐకి ఎన్నికలు నిర్వహిస్తామని కేంద్రం హామీ ఇవ్వడంతో.. రెజ్లర్లు తమ ఉద్యమానికి తాత్కాలికంగా విరామం ప్రకటించారు.

## 'ఉబర్.. ర్యాపిడో'పై మీరేమంటారు? కేంద్రాన్ని అభిప్రాయమడిగిన సుప్రీం




దిల్లీ: దేశ రాజధానిలో ఉబర్ ర్యాపిడో వంటి బైక్ ట్యాక్సీల నిషేధం వివాదంపై సుప్రీంకోర్టు లో విచారణ జరిగింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ కూడా అభిప్రాయం తెలపాలని కోరింది. ఈ మేరకు కేసుకు సంబంధించిన పిటిషన్లను సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు అందజేస్తున్నట్లు కోర్టు తెలిపింది. అసలు ఈ వివాదం ఎలా మొదలైందంటే.. దిల్లీ లో ఉబర్.. ర్యాపిడో వంటి బైక్ ట్యాక్సీ అగ్రిగేటర్లపై అక్కడి ప్రభుత్వం నిషేధం విధించింది. నాన్–ట్రాన్స్‌పోర్ట్ కింద రిజిస్ట్రేషన్ చేసుకున్న ద్విచక్ర వాహనాలను ప్రయాణికులను తీసుకెళ్లేందుకు ఉపయోగించడాన్ని తప్పుపట్టింది. వాణిజ్య కార్యకలాపాలకు ద్విచక్రవాహనాన్ని ఉపయోగించడం.. మోటారు వాహన చట్టం(1988 )ను ఉల్లంఘించడమేనని పేర్కొంటూ రవాణా శాఖ నోటీసులు జారీ చేసింది. దీనిపై ఉబర్.. ర్యాపిడో హైకోర్టును ఆశ్రయించగా.. దిల్లీ ప్రభుత్వం ఇచ్చిన నోటీసుపై కోర్టు స్టే విధించింది. ఈ అంశంలో పూర్తిస్థాయిలో ఓ విధానం రూపొందించే వరకు బైక్ ట్యాక్సీ సేవలను కొనసాగించడానికి అనుమతిచ్చింది. హైకోర్టు విధించిన స్టేను సవాల్ చేస్తూ దిల్లీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ అనిరుధ బోస్, జస్టిస్ రాజేశ్ బిందాల్‌తో కూడిన వెకేషన్ బెంచ్.. ఈ అంశంలో కేంద్ర ప్రభుత్వం అభిప్రాయం కూడా తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇరువర్గాల పిటిషన్లను సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు అందజేయాలని కోర్టు సిబ్బందికి సూచించింది. వాటిని పరిశీలించి కేంద్రం తమ అభిప్రాయం తెలియజేస్తే.. దానిని పరిగణనలోకి తీసుకొని విచారిస్తామని సుప్రీంకోర్టు వెల్లడించింది.

## శరద్ పవార్‌ను బెదిరిస్తూ.. సుప్రియా సూలేకు వాట్సప్ మెసేజ్



ముంబయి: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శరద్ పవార్ కు బెదిరింపులు వచ్చాయి. తన తండ్రిని బెదిరిస్తూ వాట్సప్‌లో తనకు మెసేజ్ వచ్చినట్లు పవార్ కుమార్తె, ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే తెలిపారు. దీంతో ఆమె ముంబయి పోలీసులను ఆశ్రయించారు.

దీనిపై తాజాగా ఆమె మీడియాతో మాట్లాడారు. నాకు ఈ బెదిరింపు మెసేజ్ వచ్చింది. ఓ వెబ్‌సైట్ ద్వారా పవార్‌ను బెదిరిస్తూ ఆగంతకులు సందేశం పంపారు. దీంతో నేను పోలీసులకు ఫిర్యాదు చేశాను. ఈ విషయంలో మహారాష్ట్ర హోం మంత్రి, కేంద్ర హోంమంత్రి త్వరితగతిన జోక్యం చేసుకోవాలి. పవార్‌జీ ఈ దేశ నేత. ఆయన భద్రత బాధ్యత కేంద్ర హోంశాఖదే. దీనిపై అమిత్ షా చర్యలు తీసుకోవాలి. ఇలాంటి చర్యలు నీచ రాజకీయాలకు నిదర్శనం. ఇవి వెంటనే ఆగాలి" అని సుప్రియా డిమాండ్ చేశారు. అయితే, ఈ మెసేజ్ ఎవరు పంపారన్నది ఇంకా తెలియరాలేదు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

### రాఘవ్ బెయిల్ 15 నుంచి 5 రోజులకు కుదింపు

దిల్లీ: దిల్లీ మద్యం కేసులో నిందితుడిగా ఉన్న మాగుంట రాఘవ్‌కు బెయిల్ మంజూరుపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. దిల్లీ హైకోర్టు 15 రోజుల మధ్యంతర బెయిల్ ఇవ్వడాన్ని ఈడీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం.. మాగుంట రాఘవ్ బెయిల్‌ను 15 రోజుల నుంచి ఐదు రోజులకు కుదించింది. ఈనెల 12న స్థానిక కోర్టులో హాజరుకావాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

"బెయిల్ పొందే విషయంలో రాఘవ్ కోర్టుకు అబద్ధాలు చెప్పారు. మోసపూరితంగా బెయిల్ పొందారు. తొలుత అమ్మమ్మకు, తర్వాత నానమ్మకు అనారోగ్యం అన్నారు. ఆ తర్వాత భార్య ఆత్మహత్యాయత్నం పేరుతో తప్పుడు ఆధారాలు ఇవ్వబోయారు. నివేదికలు, ధ్రువపత్రాలు పరిశీలించాలంటే పిటిషన్ వెనక్కి తీసుకున్నారు. ధనవంతులు ఇలాంటి వైద్య నివేదికలు తేవడం పరిపాటిగా మారింది. రాఘవ్‌కు సాధారణ బెయిల్ ఇచ్చేందుకు ట్రయల్ కోర్టు నిరాకరించింది. కుటుంబసభ్యుల అనారోగ్యం పేరుతో మధ్యంతర బెయిల్‌కు ప్రయత్నిస్తున్నారు" అని ఈడీ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. మాగుంట రాఘవ్ ఇప్పటికే బెయిల్‌పై విడుదలైనందున దాని కాలాన్ని ఐదు రోజులకు కుదిస్తున్నామన్న సుప్రీంకోర్టు.. ఈనెల 12న తప్పనిసరిగా స్థానిక కోర్టులో హాజరు కావాలని ఆదేశాలు ఇచ్చింది.

## 'మీరు బాగుంటేనే.. ప్రజలు బాగుంటారు'

ఫలితంగానే జీపీఎస్‌ను రూపకల్పన చేశాం. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపైనా కూడా మంచి ఆలోచన చేశాం. సుప్రీంకోర్టు తీర్పులనుకూడా పరిగణలోకి తీసుకున్నాం. వారికి మంచి చేయాలన్న ఆలోచనతో అడుగులు ముందుకేశాం. అలాగే వైద్యవిధాన పరిషత్‌ఉద్యోగులనుకూడా ప్రభుత్వంలో విలీనం చేశాం. వారికీ మంచి పరిష్కారం చూపించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం" అని సీఎం జగన్, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో స్పష్టం చేశారు.

### జిల్లాలో 194 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్

## ప్రతి పాదనలకు ఆమోదం

జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు: మొదటి విడత సమావేశంలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులకు సంబంధించిన విషయాలను చర్చించడం జరిగిందని, అందులో భాగంగా అక్రిడిటెడ్ జర్నలిస్టులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించడానికి చర్యలు చేపట్టామన్నారు. కేజీహెచ్ డౌన్లో గల డాల్ఫిన్ డయాగ్నొస్టిక్స్ సర్వీసెస్ సెంటరు నందు ఈనెల 10వ తేదీ ఉదయం 10 గంటల నుండి 2023 సంవత్సరంలో అక్రిడిటేషన్ పొందిన అక్రిడేటెడ్ జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు (56 పరీక్షలు ) నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని జిల్లా ఇన్చార్జి మంత్రి మరియు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ప్రారంబిస్తారని తెలిపారు. వైద్య పరీక్షలు చేయించుకునే అక్రిడేటెడ్ జర్నలిస్టులు కె.జి.హెచ్ వద్ద గల డాల్ఫిన్ డయాగ్నొస్టిక్స్ సర్వీసెస్ నందు 10 వ లేదీ నుండి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, రోజుకి 30 మంది చొప్పున వైద్య పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు కావున అక్రిడిటెడ్ జర్నలిస్టులు తప్పక హాజరు కావాలని , ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు , కన్వీనర్ మరియు మెంబరు వి.మణిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐ–టీడీపీ ఆర్గనైజేషన్ పనితీరు బాగుందు

తెదేపా మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి విషయం చాలా విలువైందని, ప్రతి ఒక్కరికీ వీటిని చేరువ చేయాలని ఐటీడీపీ కార్యకర్తలకు సూచించారు. ప్రజలకు పార్టీ సిద్ధాంతాలను చేరవేసే విధానం మారుతోందన్నారు. ఐ–టీడీపీ ఆర్గనైజేషన్ పనితీరు బాగుందని కితాబిచ్చారు. ఏ సందేశమైనా కార్యకర్తలకు వెంటనే చేరిపోతోందన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించారని, ఐటీడీపీ కృషి వల్ల 21 లక్షల మంది సభ్యత్వం నమోదైందని ప్రశంసించారు. ఏ కంటెంట్ ఎవరికి పంపాలో వారికి చేరేలా కృషి చేస్తున్నారని చెప్పారు. "18 నుంచి 59 ఏళ్ల మహిళలకు ఆడబిడ్డ నిధి ప్రకటించాం. అమ్మకు వందనం పథకం కింద రూ.15,000 అందిస్తాం. దక్షిణ భారతంలో జనాభా తగ్గిపోయే పరిస్థితి ఉంది. స్థానిక సంస్థల్లో పోటీ చేసే వారికి ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ మంది ఉంటే వారు పోటీకి అనర్హులు. తెదేపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ చట్టాన్ని తొలగిస్తాం. ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తాం. సంపద సృష్టించి ఉద్యోగాలు కల్పించిన పార్టీ తెదేపా. పేదలకు సంపద పంచడం తెలిసిన పార్టీ. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి అందిస్తాం. 20 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం. బీసీల కోసం భద్రత చట్టం తీసుకొస్తాం. ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందిస్తాం. సంపద సృష్టికి పీ–4 నమూనా తీసుకువస్తాం." అని చంద్రబాబు అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు కోర్టులో మేలు జరగాలని దేవాదాయ శాఖ మంత్రి పూజలు చేస్తున్నారని చంద్రబాబు విమర్శించారు. ప్రతి మతానికి కొన్ని సంప్రదాయాలుంటాయని, వాటిని దెబ్బతీసేలా ప్రవర్తించడం మంచిది కాదన్నారు. వైకాపాలో మొత్తం జోకర్లు ఉన్నారన్న చంద్రబాబు.. ఎన్నికలకు కార్యకర్తలు అస్త్రాలను సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి వ్యక్తి శక్తిమంతమైన ఐటీ సాధనంగా మారాలన్నారు. కార్యకర్తలు సొంత ఊరి నుంచే ఆన్‌లైన్‌లో పని చేసేందుకు నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. " భవిష్యత్‌లో వర్చువల్, ఫిజికల్ సమాంతరంగా వెళ్తాయి. రెండింటినీ అందిపుచ్చుకునే నాయకత్వం కావాలి. మండలాల వారీగా వర్క్ స్టేషన్ల ఏర్పాటుకు యోచిస్తున్నాం. కార్యకర్తలు పార్టీకి ప్రచార సారథులుగా మారాలి. దోపిడీదారులు, పేదలకు మధ్య జరిగే పోరాటం ఇది. ప్రజల ఆస్తులు దోచుకున్న వారి నుంచి వెనక్కి రాబడతాం. సంపదకు కొదవ లేదు.. సంపదను కొందరు దోచుకున్నారు. సంపదను కాపాడేందుకు నిజమైన పోలీసులుగా ఉంటాం. పేదలను ధనికులను చేస్తాం. ఎప్పుడు ఎన్నికలు జరిగినా పోరాటానికి సిద్ధంగా ఉండాలి." అని చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ సామాన్య కుటుంబంలో పుట్టి అసాధారణ శక్తిగా ఎదిగారని చంద్రబాబు అన్నారు. రైతులకు రూ.20వేలు ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించాం. దీనిని ప్రజల్లోకి తీసుకెళ్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది. సమస్యలను సామాజిక మాధ్యమాల్లో పంచుకొని చైతన్యం తేవాలి. సమస్యల పరిష్కారానికి తెదేపా రావాల్సిన అవసరం ఉందని చాటిచెప్పాలి. గతంలో ఫౌండేషన్ వేసిన వాటికే మళ్లీ ఫౌండేషన్ వేస్తున్నారు. హైదరాబాద్‌కు దీటుగా మరో నగరం కట్టాలని సంకల్పించాం. అమరావతి కోసం రైతులు 34 వేల ఎకరాలు ఇచ్చారు. పార్టీపై విశ్వాసంతోనే 29 వేల మంది రైతులు భూములిచ్చారు. తెదేపా వచ్చాక అమరావతిలో పనులు పరుగులు పెట్టిస్తాం" అని చంద్రబాబు అన్నారు.

## వైఎస్ భాస్కర్‌రెడ్డికి బెయిల్ నిరాకరణ

చేసింది. భాస్కర్ రెడ్డి బెయిలు పిటిషన్‌లో సీబీఐ దాఖలు చేసిన కౌంటర్‌లో ఈ వివరాలను వెల్లడించింది. గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, దస్తగిరి హత్య పథకాన్ని అమలు చేయగా.. సాక్ష్యాలను ధ్వంసం చేసి వివేకా గుండెపోటుతో మృతి చెందారని నమ్మించడంలో.. భాస్కర్ రెడ్డి, అవినాష్ రెడ్డి, శివశంకర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ రెడ్డి కలిసి కుట్ర చేశారని సీబీఐ అభియోగాలు మోపింది.

## ఎన్ఫోర్స్మెంట్ బృందాలతో దాడులు



విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ సి ఎం సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ డాక్టర్ వి సన్యాసిరావు ఆధ్వర్యంలో నిషేధిత ప్లాస్టిక్ కలిగి ఉన్న దుకాణాలపై ఎన్ఫోర్స్మెంట్ బృందాలు తనిఖీ చేసి అపరాధ రుసుం వసూలు చేశారు. నగర పరిధిలో ప్లాస్టిక్ అమ్మే దుకాణాలుపై, వాడే వర్తకులపై ఎన్ఫోర్స్మెంట్ బృందాల 8 జోన్లలో దాడులు నిర్వహించి నిషేధిత దుకాణ దారుల నుండి ప్లాస్టిక్ ను పట్టుకోవడంతోపాటు 58 దుకాణాదారుల నుండి ఈ రోజు అనగా తేదీ 09-06-2023(శుక్రవారం) తనిఖీ చేసి రూ.1,16,300లు అపరాధ రుసుం వసూలు చేసి, 130.31 కె.జిల ప్లాస్టిక్ పట్టుకోవడం జరిగిందని అదనపు కమిషనర్ తెలిపారు. విశాఖ నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు జివిఎంసి కమిషనర్ ఎంతో ప్రయత్నిస్తున్నారని అదనపు కమిషనర్ తెలిపారు. నగర పరిధిలో చిన్న, పెద్ద దుకాణదారులు నిషేధిత ప్లాస్టిక్ అమ్మడం, వాడకం చేసినట్లయితే అపరాధ రుసుంతో పాటు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# భారత్ సమాజ్ డెవలప్ పార్టీ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ



అక్కయ్యపాలెం, విజయ భాను న్యూస్ : ఒరిస్సాలో జూన్ రెండవ తారీఖున కోర మండల ఎక్స్ప్రెస్ యాక్సి డెంట్ అందరికీ తెలిసిన విషయమే అందువలన ఒరిస్సాలో కోరమండల్ ఎక్స్ప్రెస్ యాక్సిడెంట్ లో చని పోయినటువంటి మరి ఆత్మలకు అందరికీదేవుడు ఆత్మ శాంతిని ఇవ్వవలసిం దిగా కొవ్వొత్తుల ర్యాలీ నిన్న సాయంత్రం విశాఖపట్నం లో పచ్చిమనియోజకవర్గం మల్కాపురం ప్రాంతంలో భారత్ సమాజ్ డెవలప్ పార్టీ ఆధ్వ ర్యంలో శాంతి ర్యాలీ జరిగింది. ఆయా కార్యక్రమంలో ముఖ్య అతిథులు భారత్ సమాజ్ డెవలప్ పార్టీఅధ్యక్షులు ముఖ్యఅతిధి గా చింతాడ సూర్యము పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి అనేకమైనటువంటి కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర క్రిస్టిన్ సెల్ అధ్యక్షుడు టి లివింగ్ స్టన్ అధ్యక్షులు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆత్మశాంతి రాలీ లో మాట్లాడుతూ ట్రైన్ ప్రమాదంలో చనిపోయినటువంటి మూడు వందలు మంది వరకు చనిపోయిన విషయం అందరకు తెలిసినదే కావున చనిపోయిన ప్రతీ కుటుంబీకులు అందరికీ కూడా చనిపోయిన వ్యక్తి కుటుంబానికి 50 లక్షల రూపాయలు మరియు ఒక ఉద్యోగం సెంట్రల్ గవర్నమెంట్ రైల్వే డిపార్ట్మెంట్ కి ఇవ్వమని భారత్ సమాజ్ డెవలప్ పార్టీ డిమాండ్ చింతాడ సూర్యం డిమాండ్ చేశారు అంతేకాకుండా సెంట్రల్ గవర్నమెంట్ ప్రభుత్వం నరేంద్ర మోడీ గారికి అలాగే ఆయా ప్రాంతంలో చనిపోయారు ఆ యా కుటుంబాల్లో ఆయా రాష్ట్ర ముఖ్యమంత్రి కానీ ఆ యొక్క రాష్ట్ర అధికారులు కానీ ప్రతి ఒక్కరు కూడా చని పోయిన కుటుంబాలకు క్షత గాత్రులకు సహాయం చేయలి అని కోరారు. చనిపోయిన ప్రతి ఇంటికి 50 లక్షల రూపాయలు ఒక ఉద్యోగం కల్పించాలని భారత సమాజ్ డెవలప్ పార్టీ డిమాండ్ చేస్తుంది అని చింతాడ సూర్యం తెలియజేశారు రైలు ప్రమా దంలో గాయపడినటువంటి క్షత గాత్రులకు ప్రతీ ఒక్కరికి 25 లక్షల వరకు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేస్తుంది భారత సమాజ్ డెవలప్ పార్టీ చిన్నచిన్న గాయాలైనటువంటి వారికి ఐదు లక్షల వరకు ఇవ్వమని డిమాండ్ చేస్తుంది భారత్ సమాజ్ డెవలప్ పార్టీ చింతాడ సూర్యం జాతీయ అధ్యక్షులు తెలియజేశారు. అలాగే ఈ కార్యక్రమంలో నాయకు లు ప్రతి ఒక్కరు కూడా మాట్లాడుతూ క్షతగాత్రులకు చనిపోయినటు వంటి వారి కుటుంబాలకి ఆయా ప్రాంతాల్లో ఉన్నటువంటి అధికారులు గవర్నమెంట్ అధికారులు ప్రభుత్వాలు కలసి భారత్ సమాజ్ డెవలప్ పార్టీ డిమాండ్ చేసినటువంటి నష్ట పరిహారము ఇవ్వమని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ చైర్మన్ పొట్నూరు రాజు చింతాడ ప్రదీపు జోసఫ్ రాజు ప్రకాష్ అబ్రహం పాపారావు కనకారావు గండి రాజేశ్వరి కమలమ్మ నరేంద్ర అరున్ మొదలగు వారు పాల్గొన్నారు.

# స్వామి ఆలయ నిర్మాణం అభివృద్ధి కొరకు బురద రాజు 10116 విరాళం



పరవాడ, విజయభాను న్యూస్ : అనకాపల్లి జిల్లా పరవాడ మండలం నాయుడుపాలెం మరియు ముత్యాలమ్మ పాలెం గ్రామపంచాయతీ పరిధిలో హనుమాన్ నగర్ వద్దను నిర్మాణం జరుగుతున్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణం అభివృద్ధి కొరకు వాడచీపురుపల్లి పంచాయతీ పరిధిలోని గల దళాయిపాలెం బురదపేట వాస్తవ్యులు కీ!శే! బురద అప్పారావు గారి కుమారుడు లంకేలపాలెం కోపరేటివ్ బ్యాంకు చైర్మన్ బురద అప్పలరాజు (రాజు) గారు 10,116/- పది వేల నూట పదహారు రూపాయలు తమ వంతు సాయంగా విరాళం అంద జేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులకు విరాళ మొత్తాన్ని అందజేశారు,ఆలయ కమిటీ సభ్యులు బురద రాజు గారికి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో నాయుడు పాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య ఈరుగుల లక్ష్మీప్రసాద్,ఒలిశెట్టి అప్పలరాజు,కిలపర్తి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు

# సింహాద్రి అప్పన్న దర్శనం చేసుకున్న అక్షయపాత్ర చైర్మన్ శ్రీమన్ మధుపండిత దాస



సింహాచలం, విజయభాను న్యూస్ :విశాఖ ఆరాధ్య దైవమైన శ్రీ వరహా లక్ష్మి నరసింహుని దర్శనం జన్మధన్యం... శుక్రవారం సాయంత్రం 4 గంటలకు సాంప్రదాయబద్ధముగా పూజ్యులు శ్రీమాన్ మధు పండిత దాస స్వామీజీ (పద్మశ్రీ అవార్డు గ్రహీత) – అక్షయపాత్ర ఫౌండేషన్ చైర్మన్ మరియు ఇస్కాన్ బెంగళూరు అధ్యక్షులు పాల్గొన్నారు. ఆలయ సిబ్బంది వీరిని గౌరవ సత్కారములతో స్వాగతం పలికారు.దర్శనానతారం స్వామి వారి శేష వస్త్రాములు, ప్రసాదమును మరియు వేదం పండితులు ఆశీర్యవచనం వీరికి అందచేశారు.వీరి వెంట డాక్టర్ నిష్కించిన భక్తదాస గారు హరే కృష్ణ మూవ్మెంట్ ప్రెసిడెంట్ ,విశాఖపట్నం ,శ్రీ జయ చైతన్య ప్రభు ప్రెసిడెంట్, మైసూర్ మరియు శ్రీ సువ్యక్త నరసింహ ప్రభు, ప్రెసిడెంట్ హరే కృష్ణ మూవ్మెంట్, చెన్నై.. సింహాద్రి నాధుని దర్శన సేవలో పాల్గొన్నందుకు మరియు మనోహరమైన స్వామి వారి దర్శనము జరిగినందుకు వారు హర్షం వ్యక్తం చేశారు.

# 67వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



గాజువాక (విజయభాను న్యూస్ : జీవీఎంసీ 67వ వార్డు పరిధి జోగవా నిపాలెం అశోక్ నగర్ మారుతి నగర్ గణేష్ నగర్ లో డీసీఎంఎస్ చైర్మన్ పల్లా చిన్నతల్లి ఆధ్వర్యంలో సుమారు రూ. 1 కోటి 36 లక్షలు నిధులతో సీసీ రోడ్డు. సీసీ కాలువలు. అభివృద్ధి పనులకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి వార్డులో ప్రజా సమస్యలు తెలుసుకొని. తక్షణమే పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నాని, ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలకు సంక్షేమంతో పాటు అభివృద్ధి నీ కూడా అందిస్తున్నారని అన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ పల్లా చిన్న తల్లి మాట్లాడుతూ... ఎప్పటికప్పుడు వార్డులో పర్యటించి ప్రజల నుండి సమస్యలు అడిగి తెలుసుకొని సమస్యలు పరి ష్కరానికి కృషి చేస్తున్నట్లు, దానిలో భాగంగానే జోగవాని పాలెం అశోక్ నగర్ మారుతి నగర్ గణేష్ నగర్ ప్రాంతాలలో సుమారు రూ.కోటి 36 లక్షలు నిధులతో సీసీ రోడ్డులకు శంకుస్థాపన చేయడం జరిగిందనీ అన్నారు. ఈ కార్యక్రమం. జీవీఎంసీ జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం 67వ వార్డు కార్పొ రేటర్ పల్లా శ్రీనివాసరావు,వార్డు నాయకులు సూర్య నారాయణ, అచ్చిం నాయడు,పల్లా పెంటారావు, నాయుడు, మీరాబాయి, లక్ష్మి,అన్నపూర్ణ, అమ్మజి,నిర్మల, సచివాలయం జీవీ ఎంసీ సిబ్బంది స్థానిక నేతలు పాల్గొన్నారు.

# అండిబోయిన లక్ష్మీకు ఘన సత్కారం




గాజువాక (విజయభాను న్యూస్) : జీవీఎంసీ 72వ వార్డు ఉడా కాలనీలో వైసిపి రాష్ట్రఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మార్డిపూడి పరదేశి ఆధ్వర్యంలో ఇటీవల ఇండియా రాజధాని ఢిల్లీలో జవహర్లాల్ నెహ్రూ స్టేడి యంలో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో యోగాలో స్వర్ణ పథకం సాధించిన ప్రముఖ న్యాయవాది,ఏపీ స్టేట్ యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండి బోయిన లక్ష్మీ ని పవర్ లిఫ్టింగ్ లో బంగారు పతకం సాధించిన అండి బోయిన అప్పారావులను ఘనంగా సత్కరించారు. శాలువ కప్పి పుష్పగుచ్ఛనిచ్చి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ ముందుగా జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొని స్వర్ణ పథకం సాధించిన అండి బోయినలక్ష్మీ అండి బోయిన అప్పారావు లకు అభినందనలు తెలియజేశారు. అలాగే ఇదివరకు కూడా ఎన్నో మెడల్స్ సాధించి డిస్టెక్టి, స్టేట్, నేషనల్ లెవెల్ లో రన్నింగ్ లోస్వర్ణ పథకాలు సాధించారని, ఇప్పుడు యోగాలో కూడా నేషనల్ లెవెల్ లో ఢిల్లీలో స్వర్ణ పథకం సాధించడం మన రాష్ట్రానికి గాజువాక నియోజకవర్గానికి ఎంతో గర్వకారణంమని కొనియాడారు.

ఇంకా ఎన్నో మెడల్స్ సాధించాలని మన రాష్ట్రానికి మన దేశానికి మంచి పేరు తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రజక డైరెక్టర్ యువశ్రీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి వెంపటి అప్పారావు,రంభ నారాయణమూర్తి, మంత్రి శంకర్ నారాయణ, చిత్రాడ వెంకటరమణ, గోందేసి సత్య రావు,గౌరుసు సత్యంరెడ్డి,పిట్ట రెడ్డి, వాసు అప్పల రెడ్డి,గొందేశి అప్పల రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ సమావేశం




భీమునిపట్నం: విజయభాను న్యూస్ : స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ సమావేశం శుక్రవారం భీమిలి సి.హెచ్.సి లో జరిగింది. ఈ సమావేశంలో పేషెంట్ సేవలు, సౌకర్యాలు మెరుగు పరచుటకు,హాస్పిటల్ అభివృద్ధి కొరకు కావలసిన అజెండా ప్రకారం చర్చించారు. ఈ సమావేశంలో భీమిలి శాసనసభ్యులు ముత్తం శెట్టి. శ్రీనివాసరావు హాజ రయ్యారు. ఈ సమావేశంలో సిహెచ్ సి కి అవసరమయిన అత్యవసర మందులు,ల్యాబ్ కిట్,ఇసిజి రోల్స్ కొనుగోలు నిమిత్తం,సర్జికల్ ఇన్స్టుమెంట్స్,ఎలక్ట్రిషియన్,ప్లంబింగ్ రిపేర్లు గురించి,ఆక్సిజన్ సిలిండర్ ఫిల్లింగ్, రవాణా ఖర్చులు, వార్డులో ఉన్న కిటికీలకు దోమ తెరలు వేయడం కోసం, ఆసుపత్రిలో ఫ్యాను లు,లైట్లు కొనుగోలు నిమిత్తం,కొత్త ఆపరేషన్ ధియేటర్ నందు ట్విన్ డమ్ లైట్ కొరకు, బ్లడ్ నిలువ చేసేందుకు, లేబరేటరీ,కొత్త ఆపరేషన్ థియేటర్ లలో 3 ఏసి లు కొనుగోలు నిమిత్తం, ఎక్సరే మిషన్ రిఫేర్ తదితర వాటిపై అజెండా లో చర్చించారు.

ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ ఎం. ఫణి కుమార్ జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, సిహెచ్ సెంటర్ సిబ్బంది డాక్టర్లు డాక్టర్ పూర్ణిమ కమిటీ సభ్యులు అచ్చిబాబు మైలపల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# రాయితీపై విత్తనాలు పంపిణీ



పరవాడ (విజయభాను న్యూస్) :పరవాడ మండల పరిషత్ కార్యాలయంలో వ్యవ సాయ మండల సమావేశంలో రాయితీపై విత్తనాలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమానికి మండల పరషత్ అధ్యక్షులు పైల వెంకట పద్మలక్ష్మీ ముఖ్య అతిధిగా పాల్గొని పంపిణి చేసారు. మండలంలో గల రైతు భరోసా కేంద్రాలు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఎంపీపి తెలిపారు. మండల వ్యవసాయాధికారి సిహెచ్ చంద్రావతి మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్ ను గాను వరి విత్తనాలు బి.పి.టి-5204 (సాంబమసూరి) రకం 80 క్వింటాళు ్ళ, ఆర్.జి.ఎల్-2537 (శ్రీకాకుళం సన్నాలు) రకం 80 క్వింటాళ్ళు, ఎం.టి.యు-1224 (మార్టేరు సాంబ) రకం 5 క్వింటాళ్ళు, మరియు ఆర్.ఎన్.ఆర్-15048 (తెలంగాణ సోన) రకం 2 క్వింటాళ్ళు వివధ రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ వరి విత్తనాలపై కేజీకి పది రూపాయలు రాయితీ వర్తిస్తుందని తెలిపారు. ఈ విత్తనాలు కావలసిన రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా రిజిస్టర్ చేసుకొని పొందగలరని తెలియ జేశారు.వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కోన రామారావు గారు మాట్లాడుతూ రైతులు తమ సొంత విత్తనాలు కాకుండా ముందే నాణ్యత నిర్ధారించబడిన వ్యవసాయ శాఖ వద్ద ఉన్న విత్తనాలు వాడి అధిక దిగుబడులు పొందగలరని సూచించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామ స్థాయిలోనే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంటున్నాయని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో పరవాడ మండల వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కా రామునాయుడు, పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు బండారు రాజశేఖర్, మండల జెసిఎస్ కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు, కన్నూరు అయ్యబాబు, గెడ్డం రమణ, గోక్యాడ జానకిరాం, వెన్నెల సన్యాసి రావు, బొండా ప్రసాద్, చుక్క అప్పలనాయుడు మరియు రైతులు పైల హరీష్, గండి కృష్ణ, రెడ్డి ముత్యాలమ్మ, పైల కుమారి తదితరులు, వ్యవసాయ విస్తరణాధికారులు పి.సంజీవరావు, ఎం.ఎన్.మూర్తి , గ్రామ వ్యవసాయ సహాయకులు గౌతమి, అనిత, అనూష, జ్యోతి, జాస్మిన్ పాల్గొన్నారు.

# జగడమే ప్రీమియర్ షో




అక్కయ్యపాలెం : భువనేశ్వరి సినీ ఆర్ట్స్ పతకం పై నిర్మించిన జగడమే చిత్ర ప్రీమియర్ షో శుక్రవారం డా బాగార్డన్స్ లలితా కాలనీ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ప్రదర్శించారు. ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే, మాటలు దర్శకత్వం రమేష్ పోతిన వహించారు. కో డైరెక్టర్ గా బొట్టా నాగేశ్వర రావు, నిర్మాత గా బీ.జయప్రకాష్ బాబు, ఫోటోగ్రఫీ విక్టర్, ఎడిటింగ్ శ్యామ్ కుమార్, సంగీతం షేక్ సారుఖ్, సౌండ్స్ రోషన్ అందించారు. ఈ కార్యక్రమంలో కంచర్ల చిత్ర డైరెక్టర్ యాద్ కుమార్,నటుడు ప్రసన్న కుమార్,విజయ్ నిర్మాణ కంపెనీ అధినేత విజయకుమార్,నటుడు పొట్టి మూర్తి,జేపీ ఎంటర్టైన్మెంట్ ప్రతినిధి ప్రకాష్ బాబుహీరో రామ్ సాయి, రాజేశ్వరి, రవినాగ్, ఎడిటర్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రంలోహీరోయిన్ గా విశాలి నటించారు.

# తక్షణ ఆర్థిక సహాయం చేసిన నాలుగవ వార్డ్ కార్పొరేటర్ కొండబాబు



భీమునిపట్నం : విజయభాను న్యూస్ : జీ వి ఎం సీ భీమిలీ జోన్ నాలుగవ వార్డ్ మంగమారిపేట నరసింహనగర్.లో వార్డులో రైతులు బాడిది బోయిన రాంబాబు, గరికిన అప్పల రాజుల గడ్డి కుప్పలు దగ్ధమయ్యాయి ఈ సందర్భంగా శుక్ర వారం నాలుగవ వార్డ్ కార్పొరేటర్ డి కొండబాబు స్థలాన్ని మరియు రైతులును పరామర్శించి నష్ట పోయిన ఇద్దరు రైతులకు చెరో ఐదు వేలు చొప్పున పదివేలు తక్షణం ఆర్థిక సహాయం అందజేశారు.

# విజయభాను

## సంపాదకీయం

### మాట నిలబెట్టుకోవాలి !

కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) స్థానంలో గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జిపిఎస్) అమలు చేయాలన్న రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయం రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్ర నిరాశకు గురిచేసింది. అలాగే 2014 జూన్ 2 నాటికి ఐదేళ్లు సర్వీసు పూర్తయిన కాంట్రాక్టు ఉద్యోగులను మాత్రమే క్రమబద్ధీకరించాలని నిర్ణయించడంతో ఇప్పుడు పని చేస్తున్న వేలాదిమంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని 2019 ఎన్నికల మేనిఫెస్టోలో వాగ్దానం చేసిన వైసిపి ప్రభుత్వం నాలుగేళ్లు గడిచాక ఇలా ప్రకటించడం దాని విశ్వసనీయతను దెబ్బతీసింది. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ విషయంలోనూ అదే పరిస్థితి. మాట తప్పం.. మడమ తిప్పం.. అన్న ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించడం తగదు. ఎన్నికల హామీల మేరకు ఒపిఎస్ రద్దు, కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజేషన్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం సూత్రాన్ని వర్తింపజేస్తేనే ఈ సర్కారు మాట నిలబెట్టుకున్నట్టు అవుతుంది. కనుక మంత్రివర్గ నిర్ణయాలను పున:సమీక్షించడం అవసరం. 'పెన్షన్ భిక్ష కాదు... అది ఉద్యోగి హక్కు' అన్న విషయం మరువరాదు.

ఉద్యోగ విరమణ చేసేనాటికి పొందే మూలవేతనంలో 50 శాతం మొత్తాన్ని ఉద్యోగికి పెన్షన్‌గా చెల్లించేలా జిపిఎస్‌ను రూపొందించామనీ, ఇది దేశానికే ఆదర్శం అవుతుందని ప్రభుత్వ పెద్దలంటున్నారు. సిపిఎస్ లో మాదిరిగానే జిపిఎస్‌లో కూడా ఉద్యోగి జీతం నుండి పది శాతాన్ని రికవర్ చేస్తామంటూ ఇదే ఆదర్శమంటే ఎలా? కాకపోతే ఉద్యోగి రిటైర్‌మెంట్ నాటికి పొందే మూల వేతనంలో 50 శాతం పెన్షన్, దానిపై డియర్‌నెస్ రిలీఫ్ ఇస్తామన్న ప్రతిపాదన గతం కంటే కొంత మెరుగనిపిస్తుంది. కాని, జిపిఎస్ ఉద్యోగికి పూర్తి స్థాయి భద్రతను ఇవ్వదు. దానికి చట్టబద్ధత ఏమిటి? పిఎఫ్‌ఆర్‌డిఎ చట్ట పరిధిలోనే కొనసాగుతూ ఉద్యోగి ఇలాంటి గ్యారెంటీలను పొందే అవకాశం ఉంటుందా? కేంద్ర చట్టానికి, రాష్ట్ర చట్టానికి మధ్య ఏ అంశంలోనైనా వైరుధ్యం తలెత్తితే అమలయ్యేది కేంద్రం మాటే కదా! బంగారు గుడ్లు పెట్టే బాతు లాంటి సిపిఎస్‌ను కేంద్రం వదులుకుంటుందా? వారిని నడిపిస్తున్న కార్పొరేట్లు తమ షేర్ మార్కెట్‌కు చేరుతున్న లక్షల కోట్ల రూపాయల ఉద్యోగుల సొమ్మును కాదంటాయా? నయా ఉదారవాద ఆర్థిక విధానాల చట్రంలో మోడీ సర్కారు పెట్టే షరతులను తు.చ. తప్పక అమలు చేసే రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తుందా? కనుక ఏతావాతా పరిశీలిస్తే జిపిఎస్ అనేది సిపిఎస్‌ను మరో రూపంలో అమలు చేయడమేనన్న పరిశీలకుల మాట సత్య దూరం కాదు.

రాష్ట్రంలో 2014 జూన్ 2 నాటికి ఐదేళ్లు సర్వీసు పూర్తయిన కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడంవల్ల సుమారు 10 వేల మంది లబ్ధి పొందుతారని సర్కారు పెద్దలు చెబుతున్నారు. కానీ ఆ కటాఫ్ తేదీ మూలంగా దాదాపు దాదాపు ఎనిమిది వేల మంది నష్టపోతున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. రెండు వేల మంది కాంట్రాక్టు లెక్చరర్లు, సుమారు 800 మంది సిఆర్‌టిలు రెగ్యులర్ కాని పరిస్థితి ఏర్పడుతోంది. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వ్యధ వర్ణనాతీతం. వివిధ యూనివర్సిటీలు, ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో 25 ఏళ్లుగా పనిచేస్తున్న టైమ్‌స్కేల్, ఫుల్‌టైమ్, కంటింజెంట్, డైలీ వేజ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ఐదేళ్లు కాంట్రాక్టు సర్వీస్ పూర్తి చేసుకున్న వెంటనే ఉద్యోగి రెగ్యులర్ అయ్యేలా చర్యలు చేపట్టాలని, రెగ్యులరైజేషన్ లోగా రిటైర్ అవుతున్న ఉద్యోగులకు పెన్షన్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్న ఆయా సంఘాల డిమాండ్లు అత్యంత న్యాయ సమ్మతమైనవి. ప్రభుత్వం తక్షణమే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలి. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడం దాని బాధ్యత. ఏది ఏమైనప్పటికీ ఈ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా పోకుండా ఉద్యోగ, ఉపాధ్యాయ, కాంట్రాక్టు, ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి, అందరి ఏకాభిప్రాయంతో ముందుకు పోవాలే తప్ప గతంలో మాదిరిగా నిర్బంధ మార్గం పట్టరాదు.

# మంత్రి కేటీఆర్ సవాల్‌ను స్వీకరిస్తున్నా: రేవంత్ రెడ్డి



హైదరాబాద్, : పార్టీ, ప్రజల కోసం పోరాడే వారికే భవిష్యత్ ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. నాయకుడిగా మారేందుకు యూత్ కాంగ్రెస్ ఓ వేదిక అని చెప్పారు. కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ మాణిక్ రావ్ ఠాక్రేనే దీనికి ఉదాహరణ అని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యవర్గ సమావేశంలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. దాదాపు 1200 మంది విద్యార్థి, యువత ప్రాణ త్యాగాలతో తెలంగాణ ఏర్పడిందని గుర్తు చేశారు. భాజపా దృష్టిలో డబుల్ ఇంజిన్ అంటే అదానీ, ప్రధాని అని ఎద్దేవా చేశారు. దేశాన్ని దోచుకోవడమే ఈ డబుల్ ఇంజిన్ పని అని విమర్శించారు. " వన్ నేషన్ వన్ పార్టీ అనేది భాజపా రహస్య అజెండా. భాజపా కుట్రలను ఛేదించి రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగరేయాలి. సెప్టెంబర్ 17న కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేద్దాం. త్వరలోనే ఎన్నికలు రాబోతున్నాయి. ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం మీరంతా కష్టపడాలి. తెలంగాణలో కేసీఆర్‌ను ఓడించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి. డిసెంబర్ 9న సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా తెలంగాణలో కాంగ్రెస్‌ను గెలిపించి కానుకగా ఇవ్వాలి." అని యువనాయకులను ఉద్దేశిస్తూ రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రి కేటీఆర్ చేసిన సవాల్‌ను స్వీకరించినట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. 2004 నుంచి 2014 వరకు జరిగిన అభివృద్ధి, 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ' 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధం. 2014 తర్వాత జరిగిన అభివృద్ధిపై కేటీఆర్, హరీశ్ చర్చకు సిద్ధమా?' అని రేవంత్ అన్నారు." తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరుతున్నా. అత్యంత కీలకమైన ఐదు అంశాలతో ప్రజలవద్దకు వెళ్తాము. అగ్రనాయకులు అందుబాటులో ఉండే అవకాశాన్ని బట్టి బహిరంగ సభలు ఉంటాయి. కర్ణాటకలో మాదిరిగానే తెలంగాణలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది." అని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ క్రియాశీల పాత్రపై సమావేశంలో చర్చించినట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. " 2024 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలి. దీనికి అవసరమైన కార్యాచరణపై యూత్ కాంగ్రెస్‌కు దిశా నిర్దేశం చేశాం. క్షేత్ర స్థాయిలో కీలకంగా పని చేసిన వారు.. రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి నాయకులవుతారని చెప్పాం. మోదీ, కేసీఆర్‌లను గద్దె దించాలంటే యూత్ కాంగ్రెస్ క్రియాశీలకంగా పని చేయాలి." అని రేవంత్ అన్నారు. గడీల పాలన పునరుద్ధరించేందుకే కేసీఆర్ ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చారని రేవంత్ విమర్శించారు. " కొద్ది మంది భూస్వాముల కోసమే ధరణి తీసుకొచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణి పోర్టల్‌ను కచ్చితంగా రద్దు చేస్తాం. రంగారెడ్డి, సంగారెడ్డి, మల్కాజిగిరి భూముల్లో అవకతవకలు జరిగాయి. వేల ఎకరాల భూమిని కేసీఆర్.. బినామీలకు కట్టబెట్టారు. ప్రభుత్వ అధికారుల దగ్గర ఉండాల్సిన సమాచారం దళారుల చేతికి వెళ్లిపోయింది. ధరణి రాకముందు రైతు బంధు రాలేదా?" అని ప్రశ్నించారు.

# ప్రసాదం కోసం వచ్చే ప్రతి ఒక్కరికీ చేప మందు అందిస్తాం: మంత్రి తలసాని



హైదరాబాద్, : చేప ప్రసాదం కోసం వచ్చే ప్రతి ఒక్కరికీ చేప మందు అందిస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మృగశిర కార్తె రోజున చేప తినాలి అనే ఒక ఆనవాయితీ ఉందని చెప్పారు. చేప మందు పంపిణీ చేస్తున్న బత్తిని కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాదం పంపిణీని మంత్రి తలసాని ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. చేప ప్రసాదం కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే లక్షలాది మంది ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. బత్తిన హరినాథ్ గౌడ్ కుటుంబ సభ్యులు ఇచ్చే చేప ప్రసాదంపై ప్రజలకు ఎంతో నమ్మకం ఉందన్నారు. కరోనా కారణంగా మూడేండ్లపాటు పాటు చేప ప్రసాదం పంపిణీ చేయలేదన్నారు.

శుక్ర, శనివారాల్లో చేప మందును అందించనున్న నేపథ్యంలో ప్రభుత్వం పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. మత్స్యశాఖ ఆధ్వర్యంలో 1.5 లక్షల కొర్రమీను చేపలను అందుబాటులో ఉంచారు. అదనంగా మరో 75 వేల చేప పిల్లలతోపాటు.. అవసరమైతే మన్ని చేప పిల్లలను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా, చేప మందుకోసం నుంచే దేశం నలుమూలల నుంచి ప్రజలు నగరానికి తరలివస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ వంటి అనేక ప్రాంతాల నుంచి వ్యాధిగ్రస్తులు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కి చేరుకుంటున్నారు.

ఈ నేపథ్యంలో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసింది. మొత్తం 32 క్యూలైన్ల ద్వారా ప్రసాదం పంపిణీ చేస్తున్నారు. నాంపల్లి గ్రౌండ్ పరిసరాల్లో 700 వరకు సీసీ కెమెరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రెండు రోజులపాటు దాదాపు 300 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేసింది.

ప్రయాణికుల కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. 10వ తేదీవరకు నగరంలోని సికింద్రాబాద్ స్టేషన్, కాచిగూడ రైల్వే స్టేషన్, జేబీఎస్, ఎంజీబీఎస్, ఈసీఐఎల్ ఎక్స్ రోడ్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు వంటి ప్రాంతాల నుంచి దాదాపు 50 బస్సులను ఏర్పాటు చేశారు. అలాగే మరో 14 ప్రాంతాల నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు 80 బస్సులను నడుపుతున్నారు.

## కవి సమయం

### పరోపకారం ఇదం పుణ్యం

పరోపకార పుణ్యాయ
పాపాయ పరపీడనం అన్నది ఆర్యోక్తి
నిరంతరం అప్రమత్తతో
మెలగడమే అసలు విజయ రహస్యం
అజాగ్రత్త అపజయానికి సోపానం
పరోపకారమే లక్ష్యంగా బ్రతికే
మానవుడికి అమరత్వం సాధ్యం
రాళ్ళ దెబ్బలు తిన్నా
తియ్యని ఫలాలను అందించే చెట్లు
ఔషధం లాంటి కమ్మని
పాలను ఎల్లెడలా ఇచ్చే గోమాత
పరోపకార తత్వానికి
చక్కని నిదర్శనములు

కవిత రచన:
సి.ప్రతాప్

## పంచాంగం

| మాసం : జ్యేష్ఠ; సప్తమి సా. 5.53 శతభిషం రా. 7.38 వ.రా. 1.39ల. 3.09 | శనివారం 10-06-2023 |
|---|---|

a **మేషం** :మీ వాగ్ధాటి, నిజాయితీలు ఎదుటివారిని ఆకట్టు కుంటాయి. స్త్రీల ఆరోగ్యంలో మెళకువ అవసరం. ఆత్మీయులకు విలువైన కాను కలు అందజేస్తారు. ఉద్యోగస్తులు విశ్రాంతికై చేయు యత్నాలు అనుకూలిస్తాయి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణాలు మంచిది కాదు. b **వృషభం** :బంధు మిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. మీ శ్రీమతి సలహా పాటించడం వల్ల ప్రయోజనం ఉంటుంది. దీర్ఘకాలికంగా ఆగిపోయిన ధనం చేతికి వస్తుంది. లక్ష్య సాధనపై దృష్టి పెట్టడానికి సరైన సమయం. స్థిరాస్తుల అభివృద్ధి, కొనుగోలు యత్నాల విషయాలలో పునరాలోచన అవసరం. c **మిధునం** :ఆర్థిక పరిస్థితి నిరాశ పరుస్తుంది. వృత్తి, వ్యాపారాలు సజావుగా సాగుతాయి. దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. బంధు మిత్రుల నుంచి విమర్శలు ఎదుర్కొంటారు. ఫైనాన్సు, చిట్‌ఫండ్ రంగాల వారికి ఖాతాదారుల నుంచి ఒత్తిడి, చికాకులు ఎదుర్కొంటారు. స్త్రీలు షాపింగ్ వ్యవహారాల్లో అపరిచిత వ్యక్తుల పట్ల మెళకువ అవసరం. d **కర్కాటకం** : ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహకరంగా ఉంటాయి. రాజకీయ కళా రంగాల వారికి విదేశీ పర్యటనలు అనుకూలిస్తాయి. ప్రముఖుల కలయికతో ఒక వ్యవహారం సానుకూలం అవుతుంది. కాంట్రాక్టులు దక్కుతాయి. మీ సంతానంతో ఉల్లాసంగా గడుపుతారు. నిరుద్యోగలకు ఇంటర్వ్యూలలో మెళుకవ అవసరం. ఖర్చులు అధిక మవుతాయి. e **సింహం** :ఆత్మీయుల మధ్య కానుకలు పరస్పరం ఇచ్చిపుచ్చు కుంటారు. నూతన వ్యాపారాలలో గణనీయమైన పురోభివృద్ధి సాధిస్తారు. అవగాహన లేని విషయాలకు దూరంగా ఉంటే మంచిది. దంపతుల మధ్య కొత్తకొత్త విషయాలు చర్చకు వస్తాయి. స్త్రీలకు పరిచయాలు, వ్యాపకాలు అధిక మవుతాయి. f **కన్య** : వ్యాపారాల్లో గణనీయమైన పురోభివృద్ధి సాధిస్తారు. నిరుద్యో గులు ఇంటర్వ్యూల్లో రాణిస్తారు. మీ శ్రమకు తగిన గుర్తింపు, ప్రతిఫలం లభిస్తాయి. మీ మాటకు ఇంటా బయటా ఆదరణ పెరుగుతుంది. చేపట్టిన పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కొంటారు. మీ వాహనం ఇతరులకిచ్చి ఇబ్బందు లెదుర్కొంటారు. g **తుల** : ఆర్థిక లావాదేవీలు, కుటుంబ సమస్యలు చక్కగా పరిష్కరిస్తారు. ప్రముఖుల కలయిక ఆశించిన ప్రయోజనం ఉంటుంది. నూతన పరిచయాలు, సంబంధ బాంధవ్యాలు మీ పురోభివృద్ధికి ఎంతగానో సహకరిస్తాయి. వృత్తి వ్యాపారాలలో ఆటంకాలను అధికమిస్తారు. స్త్రీలకు ఆరోగ్యంలో మెళకువ అవసరం. నిరుద్యోగులకు అశాజనకం. h **వృశ్చికం** :స్త్రీలు పని దృష్ట్యా ఒత్తిడి, చికాకులకు ఎదుర్కొంటారు. ఏ విషయంపై అయినా స్పందించే ముందు పరిణామాలు ఎలా ఉంటాయో మరొక్కసారి ఆలోచించండి. చేతి వృత్తుల వారికి సదావకాశాలు లభిస్తాయి. ప్రేమికులకు పెద్దల నుంచి ప్రోత్సాహం, సన్ని హితుల సహకారం ఉంటాయి. నిరుద్యోగులు నిరాశ, నిస్పృహలకు లోన వుతారు. i **ధనుస్సు** :ఆర్థిక వ్యవహారాలు, నూతన పెట్టుబడులకు సంబంధించి స్పష్టమైన నిర్ణయానికి వస్తారు. నిరుద్యోగులకు మధ్యవర్తుల పట్ల అప్రమత్తత అవసరం. స్త్రీలు, గృహోపకరణాలకు కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తారు. దూర ప్రయాణాలలో కొత్త పరిచయాలు ఏర్పడతాయి. మీ మనసుకు ఊరట, ఉల్లాసం కలిగించే సంఘటనలు జరుగుతాయి. j **మకరం** : మిత్రులకు పెద్ద మొత్తంలో ధన సహాయం చేసేటపుడు పునరాలోచన అవసరం. మిత్రులకు పెద్ద మొత్తంలో ధన సహాయం చేసేటపుడు పునరాలోచన అవసరం. మనసులో భయాందోళనలూ అనుమానాలూ ఉన్నా, ఢాంభికం ప్రదర్శించి పనులు సాఫీగా పూర్తి చేస్తారు. మీ అభిప్రాయాలకు తగిన వ్యక్తితో పరిచయాలేర్పడతాయి. స్వయంకృషితో వ్యాపారాలలో బాగా రాణిస్తారు. మీ సంతానంతో ఉల్లాసంగా గడుపుతారు. k **కుంభం** : కుటుంబీకులతో కలిసి నూతన ప్రదేశాలను సందర్శిస్తారు. మిత్రుల, సహోదరుల సాయంతో మీ పనులు సులువుగా పూర్తి చేయ గలుగుతారు. వృత్తి కళా రంగాలలో మీ ప్రాధాన్యత అధికమవుతుంది. అనుకోని మార్పులు ఏర్పడటంతో రోజువారీ మీ కార్యక్రమాలు సకాలంలో జరుగక అసహనం పెరుగుతుంది. హోటల్, క్యాటరింగ్ వ్యాపారులకు లాభం చేకూరుతుంది. L **మీనం** : ఇంటా బయటా కూడా తలపెట్టుకున్న పనులకు ఆటంకాలు తప్పక పోవచ్చు. ప్రచారసాధనాలు, రవాణా రంగాల్లో మీ పెట్టుబడులు సత్ఫలితాల నిస్తాయి. విహార స్థలాలు, దేవాలయాలను సందర్శిస్తారు. స్థిరచరాస్తుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తారు.

# పురాణాలలో స్త్రీ పురుష అంతర్భేద కథలు



## సంకీర్తన

భారత దేశంలో స్త్రీల పట్ల వివక్ష చూపిస్తారని ఒక అపవాదు ఉంది. కానీ మీరు చరిత్ర ని తిరగేస్తే ఇది నిజం కాదని స్పష్టమవుతుంది. పురాణాలలో ఈ సంప్రదాయానికి వ్యతిరేక ఉదాహరణలు బోలెడు కనిపిస్తాయి. అనేక సందర్భాలలో స్త్రీ పురుష తత్వాల మధ్య విభజన రేఖ అస్పష్టం గా ఉండటం మీకు కనపడుతుంది..పురాతన కవులు, రచయితలు ఈ స్త్రీ పురుష వివక్ష ని ధైర్యంగా తరచి చూసి ఒక్కోసారి మార్చడానికి కూడా ప్రయత్నించారు. మీ కర్మానుసారం మీరు ఆడ, మగ గానో, జంతువుగానో లేదా చెట్టుగానో పుడతారు. ఎలా పుట్టినా మృత్యు సమయం లో ఆత్మ జీర్ణ వస్త్రాన్ని విడిచిపెట్టినట్లు ఈ శరీరాన్ని వదిలి వెళ్ళిపోతుంది. అందుకే ఆత్మ స్త్రీ లేదా పురుష లింగం కాదు. ఇప్పుడు మనం హిందూ పురాణాలలో లింగ వివక్ష కి అందని కథలు చూద్దాము. ఈ కథలలో మగవారు ఆడవారి పాత్ర పోషించడానికి సిద్ధపడ్డ సంఘటనలు,మగవారు గా బ్రతికిన ఆడవారు,ఇంకా ఆడా మగా ఒకటే అని నిరూపించే కథలని చూద్దాము. ఇవి చదివి మీ భావాలని, కామెంట్లని దిగువ తెలియ చెయ్యడానికి సంకోచించకండి.

**అర్ధనారీశ్వరుడు:** అర్ధనారీశ్వర శబ్దానికి సగం స్త్రీ సగం పురుష తత్వం కలిగిన భగవంతుడని అర్ధం. మహా శివుడు మరియు ఆయన దేవేరి పార్వతి యొక్క ఏక రూపం ఈ అర్ధనారీశ్వరం. ఈ రూపం పురుష స్త్రీ తత్వాల ఏకీకరణకి ప్రతీక. ఒకళ్ళు లేకుండా ఇంకొకళ్ళు లేరూని, ఒకళ్ళు ఇంకొకళ్ళ కంటే ఎక్కువ కాదు అనీ, మరియు తనలో ఈ రెండు లక్షణాలనీ ఉంచుకున్నవాడే పరిపూర్ణ జీవితం గడపవచ్చనీ ఈ రూపం మనకి తెలియచేస్తుంది.

మోహిని శ్రీ మహా విష్ణువు అవతారం గా మోహినీ అవతారం మనకి హిందూ పురాణాలలో చాలా చోట్ల కనిపిస్తుంది. ఈ రూపాన్ని గురించి మూడు ముఖ్య కథలు చెప్తారు. మొదటిది సాగర మధనం తరువాత అమృతానికి సంబంధించిన తగవు తీర్చడానికి వచ్చిన రూపం. శ్రీ మహా విష్ణువు అందమైన మోహినీ రూపం ధరించి తెలివిగా అమృతాన్ని దేవతలకి మాత్రం పంచుతాడు. రెండోది పరమేశ్వరుణ్ణి భస్మాసురుడు అనే రాక్షసుడి బారి నుండీ కాపాడిన మోహినీ అవతారం.ఈ మనోహరమైన మోహినీ అవతారం భస్మాసురుడు తననను తాను అంతం చేసుకు నేటట్లు చేసింది. మనోహరమైన మోహినిని పరమేశ్వరుడు మోహించడం వల్ల అయ్యప్ప జననమయ్యింది. అయ్యప్ప దక్షిణ భారతం లో ప్రసిద్ధి చెందిన భగవత్ స్వరూపం. ఇంక మూడోది మహా భారతంలో. అర్జునుడి కొడుకైన అరవనుణ్ణి యుద్ధం లో పాండవుల విజయం కోసం బలి ఇవ్వ వలసి వస్తుంది.కానీ అరవణుడికి చనిపోయే ముందు వైవాహిక సుఖాలని అనుభవిం చాలని కోరిక ఉంటుంది.కానీ చావు రాసి పెట్టి ఉన్న ఈ మనిషి ని పెళ్ళాడేందుకు ఏ స్త్రీ ముందుకురాకపోయేసరికి శ్రీ కృష్ణుడే మోహిని గా మారి అరవనుణ్ణి పెళ్ళాడి అతను చనిపోయాకా దఃఖిస్తాడు.

శిఖండి ద్రుపద మహారాజుకి కుమార్తె గా పుట్టిన శిఖండి ని మగ పిల్లవాడిలాగ పెంచుతారు. కొన్ని కథల ప్రకారం శిఖండి కి అమ్మాయినిచ్చి పెళ్ళి చేసారుట కూడా. శిఖండి తన స్త్రీ తత్వాన్ని తాను వైవాహిక జీవితం గడపడానికీ , భీష్మడిని చంపటానికీ ఒక యక్షునికిచ్చినట్లు కూడా కొన్ని కథలు ప్రచారం లో ఉన్నాయి. చాలా కథల ద్వారా శిఖండి ఆడా ఉభయ లింగం అని తెలుస్తుం ది. బృహన్నల తనని తిరస్కరించాడన్న కోపం తో ఊర్వశి అర్జునుడిని ఒక సంవత్సరం స్త్రీగా మారతాడని శపిస్తుంది.కానీ ఈ శాపం అజ్ఞాతవాసం ఆఖరి సంవత్సరం లో విరాట మహారాజు కొలువులో బృహన్నల అనే స్త్రీలా ఉండటానికి ఒక వరంలా పనికొచ్చింది. కానీ కొంతమంది ఆ శాపం వల్ల అర్జునుడు స్త్రీగా కాకుండా నపుంసకుడిగా మారాడని కూడా అంటారు.

సుద్యుమ్న/ఇల పరమశివుడి తోట లోకి అనుమతి లేకుండా పొరపాటున ప్రవేశించడం వల్ల తన జీవితం లో సగ భాగం స్త్రీగా మారతాడని మగవాడిగా పుట్టిన సుద్యుమ్నుడికి శాపం వచ్చింది. అతను ప్రతీ నెలా తన తత్వాన్ని(లింగాన్ని) మార్చుకుంటుండేవాడు. అతని స్త్రీ స్వరూపాన్ని ఇల గా వ్యవహరిస్తారు.

# వీధికుక్కల బారినుంచి కాపాడండి

భీమునిపట్నం, విజయభాను న్యూస్ : జీవీఎంసీ రెండో వార్డు జీరు పేట గ్రామంలో వీధి కుక్కల బీభత్సం తో, గ్రామంలో ప్రజలు భయాందోళనతో బ్రతుకుతున్నామనీ, వీధి కుక్కల బారినుంచి మమ్మల్ని కాపాడాలనీ చిట్టివలస జ్యూట్ మిల్ కాంగ్రెస్ కార్మికసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దల్లి అప్పలరెడ్డి,జీరుపేట గ్రామస్తులు కోరుతున్నారు. శుక్రవారం జీరు పేట గ్రామస్తురాలు చిల్ల పోలితల్లి ని వీధి కుక్క దారుణంగా కరవడంతో ఆమె గాయాల పాలయిందనీ చెప్పారు. అంతేకాకుండా రాత్రుల సమయాల్లో కూడా వీధి కుక్కలు దారుణంగా అరవటం వలన చాలా ఇబ్బందులు ఏర్పడుతుందనీ , ఒంటరిగా ఎవరైనా నడిచి వెళ్ళే వారిని కరవటం వలన ఒంటరిగా వెళ్ళలేకపోతున్నామనీ చెప్పారు.

ఈ వీధికుక్కల బాధలతో జీరు పేట గ్రామస్తులు బిక్కుబిక్కు మంటూ బ్రతుకుతున్నారు. కావున జీవీఎంసీ అధికారులు వెంటనే స్పందించి ఈ కుక్కల బెడద నుండి కాపాడాలనీ జీరుపేట గ్రామస్తులు కోరుతున్నారు.

# మన సంస్కృతి సాంప్రదాయాలు తెలియజేయడమే తమ లక్ష్యం

## - దుర్హం తెలుగు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు స్వాతి మిరియాల



అక్కయ్యపాలెం, విజయభాను న్యూస్ : కనడా దేశంలో తెలుగువారిదే కాకుండా మన దేశ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామనిదుర్హం తెలుగు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు, కల్చరల్ అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ టొరంటో సహా వ్యవస్థాపక అధ్యక్షులు, డైరెక్టర్ స్వాతి మిరియాల తెలిపారు. విశాఖ నగరంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కోవిడ్ ప్రభం జనం ప్రారంభానికి ముందు తమ అసోసియేషన్ ప్రారంభించామని చెప్పారు. కెనడాలోని దుర్హం ఏరియాలో మొట్టమొదటి రిజిస్టర్డ్ తెలుగు అసోసియేషన్ తమదేనని చెప్పారు. అసోసియేషన్ ప్రారంభించిన తర్వాత తొలిసారిగా సంక్రాంతి సంబరాలు అట్టహాసంగా నిర్వహించామని తెలిపారు. ఆ తర్వాత కోవిడ్ ప్రభావం కారణంగా అనేక కార్యక్రమాలను వర్చువల్ విధానంలో నిర్వహించామని తెలియజేశారు. ఆన్లైన్లో పూజలు కూడా చేయించామని చెప్పారు. రెండేళ్ల నుండి కార్యక్రమాలు జోరుగా సాగిస్తున్నామని చెప్పారు. మన దేశము నుండి 12 అడుగుల గణనాథుడు విగ్రహాన్ని తీసుకువచ్చి జిటిఏ లో ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించామని స్వాతి మిరియాల తెలియజేశారు. ప్రతి ఏటా కొత్త కొత్త ఈవెంట్లను నిర్వహిస్తూ ప్రజలకు మన సంస్కృతి సంప్రదాయాలను తెలియజేయడంతో పాటు వినోదాన్ని అందిస్తున్నామని అన్నారు. హెూలీ మేళా, సీతారాముల కళ్యాణం, కైట్ ఫెస్టివల్, బతుకమ్మ, సమ్మర్ పిక్నిక్ ఇలా అనేక కార్యక్రమాలు, పండగలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది భారీ ఎత్తున కైట్ ఫెస్టివల్ తో పిక్నిక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కెనడాలో ఉంటున్న తెలుగువారికి మన సంస్కృతి ఆచార సంప్రదాయాలు తెలియజేసే విధంగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలుగు వారు జరుపుకునే ప్రతి పండగను కెనడాలో తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తాము నిర్వహించడమే కాకుండా అక్కడ స్థిరపడిన తెలుగువారితో కూడా ఈ పండగలు చేయిస్తున్నామని చెప్పారు. మన సంస్కృతి తో పాటు మన దేశ సంస్కృతిని ప్రతిబింబించే అన్ని పండగల విశిష్టతను తెలియజేస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని స్వాతి మిరియాల తెలియజేశారు. ప్రధానంగా అక్కడ స్థిరపడిన మన తెలుగు వారికి పుట్టిన పిల్లలకు మన సంస్కృతి, మన దేశ సంస్కృతిని తెలియజేయడమే లక్ష్యంగా తమ అసోసియేషన్ పనిచేస్తుందన్నారు. అక్కడున్న తెలుగు వారందరికీ వినోదాన్ని అందించడంతో పాటు మన సంస్కృతిని తెలియజేస్తున్నామని చెప్పారు. తెలుగు వారి అందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి సంక్షేమానికి తాము నిరంతరం కృషి చేస్తున్నామని, అక్కడి ప్రభుత్వ సహ కారం తో సమ్మర్ జాబ్స్ కూడా నిర్వహించినట్టు స్వాతి మిరి యాల తెలియజేశారు. తమ అసోసియేషన్ కు అక్కడి ప్రజలు అందిస్తున్న సహాయ సహకారాలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# గంటా శ్రీనివాసపై

## టీడీపీ జనరల్ సెక్రెటరీ పాసర్ల ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలి



విశాఖపట్నం : విజయభాను న్యూస్ 55 టిడిపి ఉత్తర నియోజకవర్గం కార్పొరేటర్లు వార్డ్ ప్రెసిడెంట్లు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విశాఖ పార్లమెంటరీ అధికార ప్రతినిధి.. సనపల వరప్రసాద్ మాట్లాడుతూ గంటా శ్రీనివాసరావు లాంటి వ్యక్తిని పాస్టర్ల ప్రసాద్ లాంటి వ్యక్తి విమర్శించే స్థాయి కాదని బేషరతుగా గంట శ్రీనివాస్ కి క్షమాపణ చెప్పి చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని పార్టీ పరంగా షోకాస్ నోటీసు ఇవ్వాలని అన్నారు. రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత మాట్లాడుతూ గంటా శ్రీనివాస్ లాంటి వ్యక్తి ప్రజలతో ఏకమై పార్టీలకతీతంగా అన్ని కార్యక్రమాలకు అటెండ్ అవుతారని అటువంటి వ్యక్తిని విమర్శించడం తగదని పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా. శ్రీనివాస్ తగు చర్యలు తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోయిలాడ వెంకటేష్. బర్ల బాలకృష్ణ. కార్తీక్ కుట్ట. బొడ్డేటి మోహన్. బొడ్డేపల్లి లలిత, గుంప ధర్మారావు, పైడి కొండ, చంగల శ్రీను, వీరు బాబు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ లెవెల్ ఎడ్వయిజరీ కమిటీ సయుక్త సమావేశం






విశాఖటపట్నం, విజయభాను న్యూస్ : జిల్లా కలెక్టర్ సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ వారి అధ్యక్షతన డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ డిస్ట్రిక్ట్ లెవెల్ ఎడ్వయిజరీ కమిటీ సయుక్త సమావేశం నిర్వహించారు. డా.ఎ.మల్లికార్జున, ఐఏఎస్ జిల్లా కలెక్టర్ వారు మాట్లాడుతూ 5% ఉచిత స్కాన్స్ అన్ని ప్రైవేటు స్కానింగ్ కేంద్రముల (క్లినిక్స్/ల్యాబ్లు/హాస్పిటల్స్) నందు విధిగా చేయాలనిమరియు ఆ వివరాలను రిజిష్టర్ లో నమోదు చేస్తూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారికార్యాలయం లో విధిగా సమర్పించాలని ఆదేశించారు మరియు రెన్యువల్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిన వారు నెల మొత్తం లో గర్భిణీ స్త్రీలకు సంబందించిన చేసిన స్కాన్స్ లో5% ఉచిత స్కాన్స్ వివరములు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారి కార్యాలయంలోసమర్పించి రెన్యువల్ రిజిస్ట్రేషన్ పొందాలని ఆదేశించారు. డా.పి.జగదీశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారు మాట్లాడుతూ లింగనిర్ధారణ చట్ట రీత్యా నేరమని ఈ విషయం లో అన్ని డిపార్ట్మెంట్స్ వారు సహకరించాలని దిశ సమావేశములలో పాల్గొని అవగాహన కలగచేయాలని పురుషునితో సమానంగా స్త్రీ యొక్క నిష్పత్తిని పెంచాలని కోరారు. ఈ సమావేశం లో డా.సంధ్యా దేవి, గైనకాలజిస్ట్, కెజిహెచ్ డా..పి.బుజ్జిబాబు, రెడియోలజిస్ట్, కెజిహెచ్ డా.చక్రవర్తి, పిడియాట్రీషియన్, కెజిహెచ్ డా.ఎస్.జీవన రాణి, పి.లక్ష్మి, దిశ పోలీస్ స్టేషన్, వెంకటేశ్వర రావు, సునీల్, ఎల్.వి.రమణి, డా.బి.ఉమావతి, మహిళా ఆరోగ్య అధికారి, డెమో బి.నాగేశ్వర రావు మరియు డెమో విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

# పరవాడ తాసిల్దార్ గా కనకారావు బాధ్యతలు స్వీకరణ

## - డీటీగా శాంతి భూషణ్ బాధ్యతలు స్వీకరణ
## - తాసిల్దార్‌కి శుభాకాంక్షలు తెలిపిన మండల విఆర్ఓ సంఘం



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ నూతన తహసీల్దార్ గా పి. కనకారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ తాసిల్దార్ గా శాంతి భూషణ్ కూడా బాధ్యతలు స్వీకరించారు.. ఇరువురిని పరవాడ మండల వీఆర్వోలు అందరూ కలిసిపుష్పగుచం అందజేసి శుభాకాంక్షలు తెలియపరిచారు ఈ సందర్భంగా నూతన తాసిల్దారు పి కనకారావు మాట్లాడుతూ...

ప్రభుత్వ స్థలాలు ఎవరైనా ఆక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించలేదని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఆర్ ఐ శ్రీలేఖ మండలంలో ఉన్న విఆర్వోలు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

## - కొనసాగుతున్న పవనన్న ప్రజా బాటా కార్యక్రమం
## - 57వ రోజుకు చేరిన పవనన్న ప్రజా బాటా
## - ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత అంటున్న డాక్టర్ కందుల



అక్కయ్యపాలెం, విజయభాను న్యూస్ : ప్రజా సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తానని దక్షిణ నియోజకవర్గం జనసేన నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో నియోజకవర్గంలో నిర్వహిస్తున్న పవనన్న ప్రజా బాటా కార్యక్రమం 57వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా పలు ప్రాంతాలలో ఆయన పర్యటించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తానని ఈ సందర్భంగా డాక్టర్ కందుల నాగరాజు తెలిపారు.ప్రజా సేవ చేసేందుకు తాను రాజకీయంలోకి వచ్చానని తన శ్వాస ఉన్నంతవరకు ప్రజా సేవకు అంకితం అవుతానని పేర్కొన్నారు.ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా రాజకీయాలకు అతీతంగా ప్రజా సేవ చేస్తానని వెల్లడించారు.కానీ చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న స్పందన పట్ల ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు.పవనన్న ప్రజా బాటా కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులువరిగల పాండు, టమట అప్పారావు,గాజుల శ్రీను, జానకి, కుమారి, వరద శ్రీను, దుర్గ, ప్రసాద్, మంగ తదితరులు పాల్గొన్నారు.

# నూకాంబిక ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



అనకాపల్లి, విజయభాను న్యూస్ : ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయ పునర్ని ర్మాణానికి శారదా పీఠాధిపతి స్వామి స్వరూపా నందేంద్ర, రాష్ట్ర పరిశ్రమ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ శంకుస్థాపన చేశారు. ముందుగా వారికి ఆలయ మర్యాదలతో వైసిపి నాయకులు దాడి జయవీర్, దాడి రత్నాకర్ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో యాగశాల నిర్మించి వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య వాస్తు హెూమాన్ని నిర్వహించారు. శంఖు శిలలు స్వామీజీ అభిషేకాలు నిర్వహించారు. దేవస్థానం తరుపున స్వామిని, మంత్రి అమర్నాథ్‌ని ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

మొదటి దశలో మూడున్నర కోట్ల రూపాయలతో ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేయనున్నట్లు ఆలయ పర్యవేక్షకులు దాడి జయవీర్ తెలిపారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహిం చారు. కార్పొరేటర్లు కొణతాల నీలిమ భాస్కర్, పీలా లక్ష్మీ సౌజన్య రాంబాబు, దేవా దాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్ సుజాత, ఆలయ కార్య నిర్వాహణాధికారి బండారి ప్రసాద్, ఉపసపది శ్రీనివాసా చార్యులు, జిల్లా ఏసీ ఎస్.రాజా రావు,కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ చేసి వాహనం నడుపుతూ దొరికితే

# రూ. 10,000 జరిమానా

## పరవాడ సీఐ పెదిరెడ్ల హెచ్చరిక



పరవాడ (విజయభాను న్యూస్): పరవాడ మండలంలో ఇకపై మద్యం సేవించి వాహనం నడిపి డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికితే అక్షరాల ఉందని 10000 జరిమానా విధించబడు తుందని పరవాడ సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు పేర్కొన్నారు.. శుక్రవారం అయినా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుపడితే ఎంతటి వారికైనా పదివేల రూపాయలు జరిమేనా లేదా వారం రోజులు జైలు శిక్ష విధించబడుతుందని ఆయన హెచ్చరించారు. అనకాపల్లి11 క్లాస్ మెజిస్ట్రేట్ పత్రికాపూర్వకంగా వాహనదారులందరికీ తెలపమని పేర్కొన్నారు. వాహనదారులందరూ వాహనానికి సంబంధించిన అన్ని రికార్డ్స్ వెంట పెట్టుకొని వాహనం నడపాలని సూచించారు.

# జడ్పీటిసి శిక్షణ తరగతుల పాల్గొన్న

# పరవాడ జడ్పీటిసి పి.ఎస్.రాజు



పరవాడ (విజయభాను న్యూస్) : కాకినాడ జిల్లా, సామర్లకోటలో జరిగిన జడ్పీటిసి శిక్షణ తరగతుల్లో పరవాడ మండలం జడ్పీటిసి పి ఎస్ రాజు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై పలు సమస్యలు చర్చించారు.. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు పలు జడ్పీటిసి అభ్యర్థులు పాల్గొన్నారు.

# శాశ్వత లోక్ అదాలత్‌తో మెరుగైన సేవలు

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా



శ్రీకాకుళం, విజయభాను న్యూస్ : శాశ్వత లోక్ అదాలత్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరం జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో హైలెవల్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రయోజన సేవలకు భంగం వాటిల్లితే శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయిం చాలని చెప్పారు.

## ప్రపంచవ్యాప్తంగా 'అన్‌స్టాపబుల్ ' చిత్రం విడుదల



పొదిలి వాస్తవ్యులు, విజయవంతమైన వ్యాపారవేత్త సెల్ బే మొబైల్స్ ఫౌండర్, రెనీస్ గ్రూప్ అధినేత షేక్ రఫీ వారి రెనిస్ ఎంటర్‌టైన్‌మెంట్ ఏటుబి ప్రొడక్షన్స్ కలిసి నిర్మించిన చిత్రం అన్‌స్టాపబుల్ శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతుంది. ఈరోజు పొదిలి పట్టణంలోని హరికృష్ణ థియేటర్లో బ్రహ్మాండంగ ఈ చిత్రం విడుదలవుతుంది ఈ వేసవికాలంలో ప్రతీ ఒక్కరూ వారి కుటుంబ సభ్యులతో కలిసి అన్‌స్టాపబుల్ చిత్రాన్ని చూసి కడుపుబ్బ నవ్వుకోవచ్చు అని రఫీ తెలిపారు. ఎన్నో హాస్య చిత్రాలకు దర్శకత్వం వహించిన డైమండ్ రత్నబాబు డైరెక్షన్లో ఏ టు బి బ్యానర్ పై తెరకెక్కించిన చిత్రం అన్ స్టాపుల్. ఈ చిత్రంలో....

నటీనటులుగా సప్తగిరి, బిగ్ బాస్ టైటిల్ విజేత వీ.జ్ సన్నీ, బిత్తర సత్తి, పోసాని మురళీకృష్ణ, పఅథ్వి, చమ్మక్ చంద్ర, అక్ష, నక్షత్ర నటించారు.

హాస్యరంగంలో 30 మందికి పైగా ఎన్నో చిత్రాల్లో నటించిన నటీ నటులంతా ఈ సినిమాలో నటించి అలరించారు.

## అత్యంత కష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నాను: కాజోల్




ఎప్పుడూ సోషల్‌మీడియాలో చురుగ్గా ఉండే కథా నాయికల్లో స్టార్ హీరోయిన్ కాజోల్ ఒకరు. తనకు సంబంధించిన ప్రతి విషయాన్ని షేర్ చేయడంతో పాటు అభిమానుల కామెంట్స్‌కు కూడా రిప్లై ఇస్తుంటుంది. తాజాగా కాజోల్ సోషల్‌మీడియా నుంచి బ్రేక్ తీసుకుంటున్నట్లు తెలిపింది.

ఇప్పటి వరకు ఇన్‌స్టాలో ఉన్న తన ఫొటోలను డిలీట్ చేసిన కాజోల్ కొన్ని రోజులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు చెప్పింది. 'ప్రస్తుతం జీవితంలో అత్యంత కఠిన పరిస్థితులను ఎదుర్కొంటున్నాను' అని తెలిపింది. అయితే, కాజోల్ పెట్టిన పోస్టుపై నెటిజన్లు మిశ్రమంగా స్పందిస్తున్నారు. కొందరేమో ఏమైందని కామెంట్స్ పెడుతుండగా మరొకొందరేమో ఏదైనా సినిమా ప్రమోషన్ కోసం ఇలా చేస్తున్నారా అని అడుగుతున్నారు. ఏలాంటి పరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కోవాలని చెబుతున్నారు. ప్రస్తుతం కాజోల్ 'ది గుడ్ వైఫ్' వెబ్ సిరీస్‌లో నటిస్తోంది. ఇందులో ఆమె లాయర్‌గా కనిపించనుంది. ఇది ఆమె తొలి ఓటీటీ సిరీస్ అవ్వడంతో దీని ప్రమోషన్స్ కోసమే కాజోల్ ఈ క్యాప్షన్ పెట్టి ఫొటోలన్నీ డిలీట్ చేసిందనుకుంటున్నారు. అలాగే 'లస్ట్ స్టోరీస్2'లోనూ కాజోల్ నటిస్తోంది. తమన్నా, మృణాల్ ఠాకూర్ నటించిన ఈ వెబ్ సిరీస్ టీజర్ తాజాగా విడుదలైంది.

## 'ఇంటింటి రామాయణం' ట్రైలర్ విడుదల



రాహుల్ రామకృష్ణ, నవ్య స్వామి, నరేశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'ఇంటింటి రామాయణం' చిత్రం నుండి తాజాగా ట్రైలర్ విడుదల చేశారు. సురేష్ నరెడ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం తెలంగాణలోని ఓ విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే కథాంశంతో తెరకెక్కుతోంది. ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, మారుతి టీం సమర్పణలో.. ఐవివై ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ ఉప్పుటూరి, గోపీచంద్ ఇన్నమూరి నిర్మిస్తున్నారు. కళ్యాణ్ మాలిక్ సంగీతం అందిస్తున్నారు. గంగవ్వ, సురభి ప్రభావతి, అంజి, బిత్తిరి సత్తి ఇతర నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## 'సినిమా బండి' దర్శకుడితో అనుపమ కొత్త ప్రాజెక్టు



అనుపమ పరమేశ్వరన్ తాజాగా ఓ తెలుగు చిత్రానికి ఓకే చెప్పారు. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో ఆమె కథానాయికగా నటించడానికి ఎంపికయ్యారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి. 'సినిమా బండి'కి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా పనిచేసిన విజరు దొంకాడ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.

## 'రంగబలి' టీజర్ విడుదల




యంగ్ అండ్ డైనమిక్ హీరో నాగశౌర్య హెూల్ సమ్ ఎంటర్ టైనర్ 'రంగబలి'. ఈ చిత్రం ద్వారా పవన్ బాసంశెట్టి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఎస్ఎల్‌వి సినిమాస్ పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. యుక్తి తరేజా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఈరోజు మేకర్స్ అన్ని ప్రధాన పాత్రలు, బ్యాక్‌డ్రాప్ ను పరిచయం చేస్తూ సినిమా టీజర్ ను విడుదల చేశారు.

దూకుడు స్వభావం, లోకల్ ఫీలింగ్స్ వున్న హీరో చాలా ఆనందంగా జీవితాన్ని గడుపుతుంటాడు.

## సుమలత కుమారుడి వివాహంలో చిరు దంపతులు!



దివంగత నటుడు, అంబరీష్, సుమలత దంపతుల కుమారుడు అభిషేక్ వివాహం ఇటీవల బెంగుళూరులోని ఓ ప్యాలస్‌లో వైభవంగా జరిగింది. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ ప్రసాద్ బిదపా కుమార్తె అవివాతో ఆయన వివాహం జరిగింది. ఈ కార్యక్రమానికి సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి ఆయన భార్య సురేఖ, బాలీవుడ్ సీనియర్ నటుడు శత్రఘ్నసిన్హా ఈ వివాహ వేడుకలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదిం చారు. అలాగే రజనీకాంత్, మోహన్ బాబు, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి.

## రాష్ట్రపతిని కలిసిన సమంత..

### ఫొటోలు షేర్ చేసిన సిటడెల్ టీమ్



సినిమాలతోనే కాదు.. వరుస వెబ్ సిరీస్‌లతోనూ అభిమానుల్లో జోష్ నింపుతోంది హీరోయిన్ సమంత ప్రస్తుతం రాజ్, డీకే దర్శకత్వంలో సిటడెల్‌లో నటిస్తోంది. ఇందులో వరుణ్‌ధావన్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంటోంది. తాజాగా సిటడెల్ టీమ్ సభ్యులు భారత రాష్ట్రపతి (ద్రౌపదీ ముర్మును) కలిశారు. ఈ ఫొటోలు నెట్టింట సందడి చేస్తున్నాయి.

ప్రస్తుతం రాష్ట్రపతి సెర్బియా పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. ఇక సిటడెల్ షూటింగ్ కూడా అక్కడే జరుగుతోంది. దీంతో సిటడెల్ టీమ్ వాళ్లు రాష్ట్రపతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక ఈ ఫొటోలను షేర్ చేసిన వరుణ్ ధావన్.. రాష్ట్రపతిని కలిసే అవకాశం వచ్చినందుకు చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఇది టీమ్‌కు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక దర్శకులు రాజ్, డీకే దీనిపై ట్వీట్ చేశారు. "గౌరవనీయులైన భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలవడం చాలా సంతోషంగా ఉంది. ఆమెకు కామెడీ సినిమాలంటే ఇష్టమని తెలిపారు. సిటడెల్ యాక్షన్ సిరీస్. అయినా, ఈ వెబ్ సిరీస్‌ను చూసేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు" అని పేర్కొన్నారు.

ప్రస్తుతం ఈ ఫొటోలు వైరలవుతున్నాయి. ఇక సిటడెల్ విషయానికొస్తే ఇది ప్రియాంక చోప్రా, రిచర్డ్ మ్యాడెన్ తదితరులు ప్రధాన పాత్రల్లో హాలీవుడ్ దర్శకులు జోష్ అపెల్బమ్, బ్రెయాన్ ఓహ్, డేవిడ్ వీల్ రూపొందించిన వెబ్‌సిరీస్. ఇదే సిరీస్ ఇండియన్ వెర్షన్‌లో తెరకెక్కుతోంది. రాజ్, డీకే దర్శకత్వం వహిస్తున్న ఈ సిరీస్‌లో వరుణ్‌ధావన్, సమంత ప్రధాన పాత్రల్లో నటించారు.

## ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నాం..

### నయనతారకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపిన విఘ్నేశ్



లేడీ సూపర్ స్టార్ నయనతార కోలీవుడ్ డైరెక్టర్ విఘ్నేశ్ శివన్‌ను గతేడాది ప్రేమ వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. నేడు వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా తన కుటుంబాన్ని ఉద్దేశిస్తూ విఘ్నేశ్ పెట్టిన పోస్ట్ నెటిజన్లను ఆకట్టుకుంటోంది. వాళ్ల పిల్లల ఫొటోలను కూడా షేర్ చేయడంతో సోషల్ మీడియా వేదికగా ఈ జంటకు అందరూ శుభాకాంక్షలు చెబుతున్నారు.

"నువ్వు నా జీవితంలోకి వచ్చి అప్పుడే ఏడాది అయిపోయింది. ఈ సంవత్సరంలో ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నాం. ఎన్నో ఊహించని పరాజయాలు.. ఎన్నో పరీక్షలు ఎదురయ్యాయి. ఇలాంటి ఎన్ని చికాకులు ఉన్నా ఒక్కసారి ఇంటికి వచ్చి నిన్నూ పిల్లల్ని చూడగానే అన్నీ మర్చిపోతాను. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. కుటుంబం ఇచ్చే బలం మరేదీ ఇవ్వలేదు. మన పిల్లలు ఉయిర్, ఉలగమ్‌లకు మంచి జీవితాన్ని అందించడానికి ప్రయత్నిస్తాను. నిన్ననే పెళ్లి చేసుకున్నట్లు ఉంది.

అప్పుడే ఏడాది అయిందంటే నమ్మలేకపోతున్నాను. మనమిద్దరం కలిసి సాధించడానికి చాలా ఉన్నాయి. మన ఆనందమైన జీవితంలోకి మరో ఏడాదికి స్వాగతం పలుకుదాం" అంటూ నయనతారకు పెళ్లి

ఇక నయనతార విఘ్నేశ్ శివన్‌లు గతేడాది అక్టోబరులో తల్లిదండ్రులైనట్లు ప్రకటించారు.

తమ ట్విన్ బేబీ బాయ్స్‌కు ఉయిర్, ఉలగమ్ అని పేర్లు పెట్టినట్టు తెలిపారు. అయితే, ఈరోజు వాళ్లకు సంబంధించిన రేర్ ఫొటోలను సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు.

## ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో ముఛోవా




ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్లోకి చెక్ రిపబ్లిక్‌కు చెందిన 19వ సీడ్ కరోలినా ముఛోవా ప్రవేశించింది. తొలి సెమీస్‌లో ముఛోవా 2వ సీడ్ అర్యానా సబలెంకపై విజయం సాధించింది. పోటా పోటీగా సాగిన సెమీస్ పోటీలో ముఛోవా 7-6(7-5), 6-7(5-7), 7-5తో బెలారస్‌కు చెందిన సబలెంకను చిత్తు చేసింది. తొలి సెట్‌ను టై బ్రేక్‌లో చేజిక్కించుకున్న ముఛోవా.. రెండో సెట్‌ను టైబ్రేక్‌లోనే ప్రత్యర్థికి కోల్పో యింది. ఇక నిర్ణయాత్మక మూడో సెట్‌లో ముఛోవా ఓ దశలో 4-5 పాయింట్లతో వెనుకబడ్డా... ఆ తర్వాత వరు సగా మూడు గేమ్ పాయింట్లు సాధించి మ్యాచ్‌ను ముగించింది.

## కాలింగ్ సహస్ర్త'లో డిఫరెంట్ సుధీర్‌ని చూస్తారు - సుడిగాలి సుధీర్



అటు బుల్లితెర ఇటు సిల్వర్ స్క్రీన్‌పై తనదైన గుర్తింపు సంపాదించుకున్న యాక్టర్ సుడిగాలి సుధీర్. ఆయన కథానాయకుడిగా నటిస్తోన్న లేటెస్ట్ మూవీ 'కాలింగ్ సహస్ర్త'. షాడో మీడియా ప్రొడక్షన్స్, రాధా ఆర్ట్స్ పతాకాలపై అరుణ్ విక్కిరాలా దర్శకత్వంలో విజేష్ తయాల్, చిరంజీవి పమిడి, వెంకటేశ్వర్లు కటూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సుధీర్ సరసన డాలిశ్య హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రం నుంచి బుధవారం 'కలయా నిజమా..' అనే లిరికల్ సాంగ్‌ను మీడియా మిత్రులు చేతుల మీదుగా రిలీజ్ చేశారు.

# ఉక్రెయిన్‌కు సాయం అందిస్తాం : అమెరికా, బ్రిటన్



వాషింగ్టన్ : రష్యా చొరబాటుకు తిప్పి కొట్టేందుకు గాను ఉక్రెయిన్‌కు సాయం అందిస్తామని అమెరికా, బ్రిటన్‌లుప్రకటించాయి. అట్లాంటిక్ డిక్లరేషన్ కింద ఇరు దేశాలు ఎదుర్కొంటున్న జాతీయ భద్రత, ఇతర ఆర్థిక భద్రతకు అవసరమైన కీలక సాంకేతిక పరిజ్ఞానాన్ని రక్షించేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించనున్నట్లు ప్రకటించాయి. బ్రిటన్ అధ్యక్షుడు రిషి సునక్ గురువారం అమెరికా అధ్యక్షుడు బైడెన్‌తో సమావేశమయ్యారు. ఇరువురు నేతలు వైట్ హౌస్‌లోని ఓవెల్ కార్యాలయంలో చర్చలు జరిపారు. కృత్రిమ మేధస్సు (ఎఐ), క్లీన్ ఎనర్జీ ట్రాన్స్‌మిషన్, మినరల్స్‌కు సంబంధించి పరస్పర సహకారం అందించుకుంటామని ప్రకటించారు. డిక్లరేషన్‌లో భాగంగా ఇరువురు నేతలు యూరోపియన్ యూనియన్‌తో సహా కీలక చర్చలు జరిపారు. ముడిసరుకుల దిగుమతులకు సంబంధించి జపాన్‌తో ఓ ఒప్పందం చేసుకున్నారు. ఉక్రెయిన్ సాయంపై కీలక చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. రష్యాపై యుద్ధానికి ఉక్రెయిన్‌కి బ్రిటన్, అమెరికాలు సాయం అందిస్తున్నాయి. ఎఫ్ -16 యుద్ధ విమానాలు అందించడంతో పాటు పైలెట్లకు శిక్షణ ఇస్తామని గత నెలలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఉక్రెయిన్‌కు ఆర్థిక సాయం అందిస్తామని బైడెన్ పునరుద్ఘాటించారు.

# టోకెన్లు లేని భక్తులకు 24 గంటల్లో సర్వదర్శనం



తిరుమల : కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తిరుమలకు చేరుకుంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి.దీంతో భక్తులు శిలాతోరణం వరకు క్యూలైన్లో నిలబడి ఉన్నారు. టోకెన్లు లేని భక్తులకు 24 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 70,160 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా 38,076 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ.3.67 కోట్లు వచ్చిందని టీటీడీ అధికారులు తెలిపారు.

ముగిసిన ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు జరిగిన వార్షిక బ్రహ్మోత్సవాలు రాత్రి ధ్వజావరోహణంతో ముగిశాయి.రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణ ఘట్టాన్ని నిర్వహించారు. గరుడ పటాన్ని అవనతం చేసి ధ్వజారోహణం నాడు ఆహ్వానించిన సకల దేవతలను సాగనంపారు. బ్రహ్మోత్సవాలలో పాలు పంచుకునే వారు సమస్త పాపవిముక్తులై, ధనధాన్య సమృద్ధితో తులతూగుతారని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవింద రాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ వాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివ కుమార్ పాల్గొన్నారు.

# బీటీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించండి

## బీటీ రోడ్డు పనులు పరిశీలించిన... మేయర్



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె 3వ జోన్ ఎంవిపి కాలనీ పరిధిలోని టిటిడి కళ్యాణ మండపం నుండి ఉషోదయ జంక్షన్ వరకు రూ.29.00 లక్షల వ్యయంతో వేస్తున్న బీటీ రోడ్డును స్వయంగా దగ్గరుండి నిర్మాణ పనులను పర్యవేక్షించారు. పనుల పరిశీలనలో భాగంగా నగర మేయర్ బీటీ రోడ్డు నిర్మాణాన్ని దగ్గరుండి నాణ్యత, మందంతో పాటు వెడల్పులు సమగ్రంగా ఉండే విధంగా వేయించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నగరంలో చేపడుతున్న రోడ్లు, కాలువలతో పాటు, ఇతర అభివృద్ధి, నిర్మాణం పనుల నాణ్యతలో రాజీ లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎంవిపి కాలనీలోని టిటిడి కళ్యాణ మండపం నుండి ఉషోదయ జంక్షన్ వరకు రోడ్డు పూర్తిగా గుంతలతో ఉన్నందున స్థానికులు చాలా ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా వారి విన్నపం మేరకు సుమారు 600 మీటర్లు బిటి రోడ్డు నిర్మాణానికి రూ. 29.00 లక్షలు కేటాయించి పనులు ప్రారంభించామన్నారు. ఈ పనుల పర్యవేక్షణలో నాణ్యతలో భాగంగా తారు, పిక్క మిక్సింగ్ తోపాటు 40 మిల్లీమీటర్ల మందం కలిగేలా బీటీ రోడ్డు లేయర్ వేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి త్వరలో విశాఖ నగరం నుండి పాలన అందిస్తారని, ఆయన సారధ్యంలో విశాఖ నగరం సుందర నగరంగా తీర్చి దిద్దటం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీనివాసరావు, సహాయక ఇంజనీర్ శిరీష, సచివాలయం సెక్రటరీలు, బీటీ రోడ్డు సంబంధించిన కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# రుణగ్రహీతలకు ఉపశమనం..

**వడ్డీ రేట్ల విషయంలో కీలక నిర్ణయం తీసుకున్న ఆర్బీఐ**

ఢిల్లీ: వడ్డీ రేట్ల పెంపు విషయంలో ఆర్బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగానే ఈసారి కూడా కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆర్బీఐ ద్రవ్యపరపతి విధాన సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రకటించారు. రెపో రేటును 6.50 శాతం వద్ద అలాగే కొనసాగుతుందని తెలిపారు. ఎస్‌డీఎఫ్ రేటు 6.25 శాతం, ఎంఎస్ఎఫ్ రేటు 6.75 శాతం, బ్యాంక్ రేటు 6.75 శాతం వద్ద స్థిరంగా ఉంటాయని వెల్లడించారు.

గత ఏప్రిల్‌లో జరిగిన తొలి ద్రవ్యపరపతి విధాన సమీక్షలో కూడా వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచుతూ ఆర్బీఐ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.

# మాధవ ధార గ్రామస్తుల కొంగు బంగారం " కుంచమ్మ "

## " మాధవ ధార గ్రామ దేవతల పండుగకు ముస్తాబు "



మాధవధార (విజయభాను న్యూస్) : స్థానిక గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 50వ వార్డ్ మాధవధార గ్రామ దేవతలు అయినా శ్రీ కుంచుమాంబ, శ్రీ కనక మాహా లక్ష్మి, శ్రీ కొత్త మహా లక్ష్మి అమ్మవార్ల పండుగ తేదీలు ఖరారు చేశారు.మాధవధార గ్రామస్తులు మరియు శ్రీ మాధవ యువజన సమాజం వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న వేడుకల్లో కుంచమ్మ ప్రధాన పండుగ జూలై 4 వ తేదీ మంగళ వారం, జూలై 11 వ తేదీన మారు వారం పండుగ, జూలై 13 గురువారం, శ్రీ కనక మహా లక్ష్మి అమ్మవారి పండుగ, జూలై 17 ఆదివారం శ్రీ కొత్త మాహా లక్ష్మి అమ్మవారి పండుగ తో ముగుస్తుంది, జూన్ 29 వ తేదీ పండుగ చాటింపు తో సందడి మొదలు, కంచరాన కుటుంబ సభ్యులు పూజారులుగా అనాదిగా పూజ విధులు నిర్వర్తించే ఆచారం నేటికీ కొనసాగుతోంది, మాధవ దార గ్రామంలో తమ పూర్వీకుల నుండి వస్తున్న సంప్రదాయ పద్ధతిలో మాధవ ధార కళింగ సామాజిక వర్గానికీ చెందిన గ్రామస్తులు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వేడుక కన్నుల పండుగ లా జరిపించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు, విశాఖ జిల్లా లోనే అత్యంత వైభోపేతంగా జరగబోయే మాధవ ధార గ్రామ దేవతల పండుగలకు వేలాది మంది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు అని అంచనాల మధ్య ఏర్పాట్లూ సాగుతున్నాయి అని గ్రామస్తుల తరుపున తెలియజేస్తూ.

**: మాధవ ధార గ్రామస్తుల కొంగు బంగారం ' కుంచమ్మ '....**

మాధవ ధార గ్రామం లో గ్రామ దేవతల పండుగలకు సందడి నెలకొంది, మాధవ ధార కళింగ సామాజిక వర్గీయుల గ్రామ దేవతలు శ్రీ కుంచు మాంభ , కనక మహ లక్ష్మి, కొత్త మహా లక్ష్మి అమ్మవార్ల పండుగలు నగారా మోగింది, జూన్ 29 వ పండుగ చాటింపు తో పండుగ సందడి మొదలవుతుంది. మాధవ ధార కళింగ సామాజిక వర్గ ప్రజలు, శ్రీ మాధవ యువజన సమాజం వారు సంయుక్తం గా నిర్వహిస్తున్న గ్రామ దేవతలు పండుగ వేడుకలకు వేలాది మంది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు, ఉత్తరాంధ్ర లోనే అత్యంత అరుదైన రీతిలో ఎంతో ఘనం గా నిర్వహించ తలపెట్టిన ఈ పండుగకు, మాధవ ధార గ్రామం లో తమ పూర్వీకుల నుండి కంచరాన కుటుంబ సభ్యులు పూజారులుగా కొనసాగుతున్నారు, తమ పూర్వీకుల నుండి కొనసాగుతున్న సంప్రదాయ పద్ధతిలో పండుగ వేడుకలు నిర్వహిస్తారు, మాధవ ధార కళింగ సామాజిక వర్గ ప్రజల ఐక్యత , ఆధరణ, అభిమానం ఎంతొ మంది కొనియాడుతారు ఆని ఎండా మాధవ స్వామి, మాధవ ధార తెలియజేశారు.

**మాధవ ధార గ్రామ కీర్తి ' కనక మహా లక్ష్మి '.....**

మాధవ ధార సీతన్న గార్డెన్స్ లో వెలిసిన శ్రీ కనక మహా లక్ష్మి అమ్మవారి పండుగ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు ఆలయ ధర్మకర్త స్వర్గీయ అంజన్న తనయుడు సనపల కీర్తి గారు, జులై 13 వ తేదీ గురువారం జరిగే ఈ ఉత్సవం లో వేలాది సంఖ్యలో భక్తు లు పాల్గొంటారు. అన్న అంచ నాల మధ్య భక్తులకి ఎటువంటి ఇబ్బం దులూ లేకుండా ఘనం గా ఏర్పాట్లు చేస్తున్నారు, మాధవ ధార గ్రామ కళింగ సామాజిక వర్గ ప్రజలు, శ్రీ మాధవ యువజన సమాజం సంయుక్తం గా నిర్వహిస్తున్న మాధవ ధార గ్రామ దేవతల పండుగ వేడుకల్లో కుంచమ్మ ప్రధాన పండుగ జూలై 4 వ తేదీ మంగళవారం



జరిగిన తరువాత, మారు వారం పండుగ జులై 11 న జరిగిన తరువాత, వరుసగా జూలై 13 వ తేదీ గురు వారం కనక మహ లక్ష్మి, పండుగ, జూలై 16 వ తేదీ ఆదివారం శ్రీ కొత్త మాహా లక్ష్మి అమ్మవారి పండుగలు నిర్వహిస్తారు, కంచరాన కుటుంబ సభ్యులు పూజారులుగా అనాదిగా గ్రామ దేవతల పూజా విధులు నిర్వహిస్తూ వస్తున్నారు. కనక మాహా లక్ష్మి ఆలయాన్ని శ్రీ దుర్గా గాయత్రి సహిత కనక మహా లక్ష్మి అమ్మవారి దేవాలయం గా, తమ సొంత నీ అధునాతన హంగులతో నిర్మించిన ఘనత స్వర్గీయ అంజన్న కుటుంబ సభ్యులకు చెందుతుంది. గ్రామ దేవతల పండుగ తో ఈ ఆలయంలో జరిగే ప్రతి వేడుక వెనుక అంజన్న వారసుడు సనపల కీర్తి కృషీ ప్రశంసనీయం, మాధవ ధార గ్రామ దేవతల పండుగ వేడుకల్లో భాగంగా జరుగతున్న కనక మహా లక్ష్మి అమ్మవారి పండుగ వేడుకలో ప్రతీ ఒక్కరూ పాల్గొని అమ్మవారికి అనుగ్రహం పొందాలి అని ఆలయ ధర్మ కర్త సనపల కీర్తి కోరుతున్నారు.



# రెండు దేశాలకు మంచిది కాదు.. భారత విదేశాంగ శాఖ




న్యూఢిల్లీ: కెనడాలో బ్రాంప్టన్ నగరంలో ఆపరేషన్ బ్లూ జరిగి 39 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖలిస్థాన్ మద్దతుదారులు నిర్వహించిన ఉత్సవాల్లో భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్యోదంతాన్ని ఒక శకటంపై ప్రదర్శిస్తూ 5కి.మీ మేర ర్యాలీ చేసి భారతదేశ ప్రతిష్టను మంటగలిపేలా ప్రవర్తించారు. దీనిపై స్పందిస్తూ ఈ హేయమైన చర్యకు పాల్పడినవారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కెనడా ప్రభుత్వాన్ని కోరారు భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్, రాష్ట్ర వ్యవహారాల మంత్రి మీనాక్షి లేఖి.

పాశవికమైన చర్య..

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏ ప్రజాస్వామ్య దేశంలోనైనా ఒకరిని హత్య చేయడమనేది నేరంగానే పరిగణిస్తారు. ఇలా వేరొకరి హత్యను బట్టి ఆనందిస్తూ సంబరాల్లా జరుపుకోవడం పాశవికం. దీన్ని శాంతిభద్రతల ఉల్లంఘనగా పరిగణించి కెనడా ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులైన వారి మీద కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ఓటు బ్యాంకు రాజకీయం..

అంతకుముందు భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ కూడా ఈ హేయమైన చర్యపై స్పందించారు. ఆయన మాట్లాడుతూ... ఇటువంటి చర్యలు ఇరుదేశాల మధ్య సంబంధాలకు మంచిది కాదన్నారు. ఈ సంఘటన వెనుక అంతర్లీనంగా మరో కారణం దాగుంది. ఓటు బ్యాంకు రాజకీయాలు చేయాలన్న ఉద్దేశ్యంతో ఎవరైనా ఇలాంటి దారుణానికి ఒడిగడతారా? ఇది వేర్పాటువాదులు, తీవ్రవాదులు, హింసను ప్రేరేపించేవారి చర్యే. ఇది ఇరు దేశాల మధ్య సంబంధాలకు కెనడా దేశానికి కూడా మంచిది కాదని అన్నారు.

# బిడ్డపై హక్కులు తల్లికే కాదు తండ్రికీ ఉంటాయ్

## క్రికెటర్ ధావన్ భార్యకు ఢిల్లీ ఫ్యామిలీ కోర్టు చీవాట్లు

న్యూఢిల్లీ: క్రికెటర్ శిఖర్ ధావన్ దాదాపు మూడేళ్ల తర్వాత తన కొడుకు జొరావర్‌ను కలుసుకోబోతున్నాడు. ఈ మేరకు అతని మాజీ భార్య అయేషా ముఖర్జికి ఢిల్లీ ఫ్యామిలీ కోర్టు చీవాట్లు పెట్టింది. తల్లి కస్టడీలో ఉన్న శిఖర్ ధావన్ 9 ఏళ్ల కొడుకు జొరావర్‌ను భారత్‌కు తీసుకురావాలని ఆదేశించింది. బిడ్డపై తల్లికి మాత్రమే కాకుండా తండ్రికి కూడా హక్కులు ఉంటాయని పేర్కొంది. కేవలం తల్లి మాత్రమే బిడ్డ అన్ని హక్కులను నెరవేర్చలేదని వ్యాఖ్యానించింది. శిఖర్ ధావన్‌కు, ఆయన భార్య అయేషా ముఖర్జికి మధ్య విభేదాలు రావడంతో ఇద్దరూ విడివిడిగా ఉంటూ విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కోర్టు జొరావర్‌ను తల్లి కస్టడీకి అప్పగించడంతో 2020లో అయేషా కొడుకును తీసుకుని ఆస్ట్రేలియాకు వెళ్లిపోయింది. ఈ క్రమంలో కొన్ని నెలల క్రితం తన ఫ్యామిలీ గెట్ టుగెదర్‌కు జొరావర్‌ను తీసుకురావాలని అయేషాను శిఖర్ ధావన్ కోరాడు. అందుకు ఆమె ఒప్పుకోకపోవడంతో ధావన్ ఢిల్లీ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించాడు. అయితే జొరావర్‌కు స్కూళ్లో ముఖ్యమైన క్లాసులు జరుగుతున్నందున తీసుకురాలేనని అయేషా తన న్యాయవాది ద్వారా కోర్టుకు తెలియజేసింది.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com